www.vaarthavedhikasurya.com

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

SCAN ME

విలేకరులు కావలెను:



వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాల బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్స్ మరియు నియోజక వర్గాల నుండి పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

పూర్తి వివరాలకు సంప్రదించగలరు.

సెల్: 9985389183, 7386949183

తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 150 | శుక్రవారం | 28, మార్చి 2025 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥



## చెప్పిన మాటలను చేతల్లో చూపించిన రేవంత్ రెడ్డి

- హైదరాబాద్ సమావేశం నేపథ్యంలో అదే బాటలో మరిన్ని రాష్ట్రాలు
- పునర్విభజనపై తెలంగాణ అసెంబ్లీ తీర్మానంపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై: నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ శాసనసభలో ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలిచిపోయే తీర్మానం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటలను చేతల్లో నిరూపించారని తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్ కొనియాడారు. మిగతా 2లో..

## ఆర్థిక విధ్వంసం మొత్తం తవ్వి తీస్తా..

- నేను యాదృచ్ఛికంగా పొలిటికల్ లీడర్ కాలేదు
- చాలా ఆలోచించి రాజకీయాల్లోకి వచ్చా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,మార్చి27(వార్త వేదిక సూర్య): నేను యాదృచ్ఛికంగా పొలిటికల్ లీడర్ కాలేదు.. చాలా ఆలోచించి రాజకీయాల్లోకి వచ్చా.ఒక ఫ్యూడల్ వ్యవస్థలో, భావ దారిద్రంలో కూరుకుపోయిన వారిని బయటపడేయాలని రాజకీయాల్లోకి వచ్చా. సమ సమాజం స్థాపనతోనే అభివృద్ధి అది జరగాలంటే చట్టసభల ద్వారానే సాధ్యమని రాజకీయాల్లోకి వచ్చా.



ప్రజల జీవన విధానం బాగుపడాలని అంతా ఆత్మగౌరంతో జీవించడం కోసం రాజకీయాల్లోకి వచ్చా. మీలాగా వ్యక్తిగత స్వార్థం కోసం రాజకీయాల్లోకి రాలేదు. వచ్చిన అవకాశాన్ని సమ సమాజ స్థాపన కోసం వినియోగిస్తాను. మీలాగా దుర్బుద్ధితో రాజకీయాల్లోకి రాలేదు. బయట చాలా మాట్లాడతారు అని వాటిని సభలో ప్రస్తావిస్తున్నారు. మేం మాట్లాడడం మొదలుపెడితే మీ కన్నా ఎక్కువ మాట్లాడగలం. గంజాయి రాజు, లిక్కర్ రాణి అని బయట చాలా మాట్లాడుతున్నారు. అవి సభలో మేము మాట్లాడం సభ్యత కాదు. ఆర్థిక శాఖలో జరిగిన ఆర్థిక విధ్వంసం మొత్తం తవ్వితీస్తా. ఉన్న విషయాలు సభలో మిగతా 2లో..

# నేను తలచుకుంటే...

## మీ ఖాందాన్ జైల్లో ఉండేది



- నేను విజ్ఞత చూపించినందుకే బయట ఉన్నారు
- నన్ను 16 రోజులు చీకటి గదిలో ఉంచారు
- బిడ్డ లగ్నపత్రిక రాసుకోకుండా అడ్డుకున్నారు
- నన్ను హింసించిన వాడికి దేవుడే శిక్షవేశాడు
- కొండపోచమ్మ నుంచి మీ ఫామ్ గౌస్‌కు నీళ్లు తీసుకెళ్లింది నిజం కాదా?
- రంగనాయక సాగర్ దగ్గర హరీష్ రావుకి ఫామ్ హౌసు ఉంది నిజం కాదా?
- మీ తెలివితేటలు తెలంగాణ కోసం ఉపయోగించండి
- కేటీఆర్ వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్

హైదరాబాద్,మార్చి27(వార్త వేదిక సూర్య): మల్లన్న సాగర్ శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుల నుంచే మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్ కు నీళ్లు తీసుకొచ్చాం. మీ లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టు గుండుసున్నా. లగచర్ల భూసేకరణపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఏటిగడ్డ కిష్టాపూర్, వేముల ఘాట్ భూసేకరణ విషయంలో బూట్లతో తొక్కించింది మీరు.మేం కూడా ఆనాడు అక్కడ ధర్నా చేశాం. కానీ మేం భూసేకరణకు వ్యతిరేకంగా ధర్నా చేయలేదు. పరిహారం పెంపుకోసం చేశాం. మేం కొట్లాడటం వల్లే మల్లన్న సాగర్ బాధితులకు పరిహారం పెంచారు. కొండపోచమ్మ నుంచి మీ ఫామ్ గౌస్ కు నీళ్లు తీసుకెళ్లింది నిజం కాదా? రంగనాయక సాగర్ దగ్గర హరీష్ రావుకి ఫామ్ హౌసు ఉంది నిజం కాదా? దీనిపై విచారణకు మీరు సిద్ధమా? సిద్ధమంటే చెప్పండి నిజ నిర్ధారణ కమిటీ వేద్దాం. ఫామ్ హౌస్ చుట్టూ కాలువలు తీసుకెళ్ళింది ఆధారాలు చూపాలా? ఇంకా ఎందుకు బుకాయిస్తున్నారు?

లగచర్లలో భూసేకరణలో బాధితులకు రూ.20 లక్షలు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తున్నాం. లగ చర్ల భూసేకరణ జరగకుండా మీరు అధికారులను చంపండి అని మీ మాజీ ఎమ్మెల్యే అక్కడి వాళ్లకి చెప్పింది నిజం కాదా? అధికారులను చంపాలని ప్రోత్సహించిన మీరు భూసేకరణ గురించి మాట్లాడుతున్నారా? ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో రూ.36 వేల కోట్ల నుంచి లక్షా 50 వేలకు పెంచింది మీరు. మీరు దిగిపోయే నాటికి కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్షా రెండు వేల కోట్లు బిల్లులు చెల్లించారు. మీరు ఫ్రాడ్ చేశారని కమిషన్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికను వచ్చే సభలో పెడతాం.

బలవంతంగా భూములు గుంజుకుంది మీరు. మీరు తెలంగాణ జాతిపిత అని చెబుతున్న కెసీఆర్‌ను కామారెడ్డి బండకేసి కొట్టారు. ప్రజలు తిరస్కరించినా ఇంకా ఎందుకు బుకాయిస్తున్నారు? మూసీ ప్రాజెక్టులు కట్టాలా వద్దా, మెట్రో రైలు నిర్మించాలా వద్దా, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మించాలా వద్దా.. అభివృద్ధి చేయాలా వద్దా చెప్పండి? మేం అధికారంలోకి వచ్చాక దావోస్ పర్యటనలో రెండు లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చాం.

మాట్లాడితే ఇంగ్లీష్ గురించి మాట్లాడుతున్నారు. చైనా, జపాన్, జర్మనీ వాళ్లకు ఇంగ్లీష్ రాదు.. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్నాయి. నేను గుంటూరులో చదువుకోలేదు, ఆ తర్వాత పూణే వెళ్ళలేదు, అమెరికా వెళ్ళలేదు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న నేను ముఖ్యమంత్రిగా ఇక్కడకు వస్తే మీకు ఎందుకు అంత కడుపుమంట? వచ్చే ఐదేళ్లు కూడా ఇక్కడ మేమే ఉంటాం. మీరు అక్కడ ఉండాలనుకుంటే సలహాలు ఇవ్వండి.

నేపాల్ యువరాజు దీపేంద్ర అధికారం కోసం కుటుంబం మొత్తాన్ని ఏకే 47 తో కాల్చి చంపాడట. అలా మీరు పెద్దాయనను కూడా ఖతం చేసి కుర్చీలో కూర్చోవాలని చూడొద్దు. మీ తెలివితేటలు తెలంగా కోసం ఉపయోగించండి.

మేం నిజంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే, వాళ్లు అక్కడ కూర్చుని నోటికొచ్చినట్లు మాట్లాడేవారు కాదు. చంచలగూడ జైల్లో నో, చర్లపల్లి జైల్లోనో మమ్మల్ని పెట్టినచోటే మిగతా 2లో..


## పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి

- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 శాతం 19 శాతానికి పడిపోయే ప్రమాదం
- త్వరలోనే భట్టి విక్రమార్క జానారెడ్డి ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సమావేశం
- శాసనసభలో నియోజకవర్గాల పునర్విభజనపై శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మార్చి27 (వార్త వేదిక సూర్య): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, నియోజకవర్గాల పెంపుపై చర్చ జరుపుతోంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం చెడిపోతుందని ఆనాడు ఇందిరా గాంధీ భావించారు. అందుకే చట్టాన్ని సవరించి పునర్విభజన చేశారు. ఇప్పుడు నియోజక వర్గాల పునర్విభజన అంశం మళ్లీ చర్చకు రావడంతో, దక్షిణాదిలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దక్షి ణాది రాష్ట్రాలకు నష్టం జరిగేలా కేంద్రం వ్యవహరిస్తే ఖచ్చితంగా మనం ఎదుర్కోవాలి. దక్షిణాది మిగతా 2లో..



## ఇక ఖాతాకు నలుగురు నామినీలు



- బ్యాంకింగ్ బిల్లుకు ఆమోదం.

న్యూఢిల్లీ, (వార్త వేదిక సూర్య): ఇప్పటివరకు ఒక బ్యాంకు ఖాతాకు ఒకరే నామినీగా ఉండేవారు. ఇక నుంచి మనం గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా పెట్టుకోవచ్చు. ఇదే రూల్ బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)కు కూడా వర్తిస్తుంది. ఈమేరకు ప్రతిపాదనలతో కూడిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024పై పార్లమెంటు ఆమోద ముద్ర వేసింది. ఇవాళ రాజ్యసభలో ఈ బిల్లుకు మెజారిటీ ఓట్లు లభించాయి. అంతకు ముందు 2024 డిసెంబరులో ఈ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. లాకర్ల విషయానికి వస్తే.. వాటికి పాత పద్ధతిలోనే ఒకరికి మించి నామినీలను పెట్టుకోవచ్చు. అయితే వారికి ప్రయారిటీని నిర్ణయించుకోవాలి. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024లోని కీలక మిగతా 2లో..

## ఆన్‌లైన్ క్యాబ్ బుకింగ్ సేవలకు కేంద్రం చెక్

- ఓలా,ఊబెర్, ర్యాపిడోల గుత్తాధిపత్యం
- చెక్ పెట్టేందుకు రంగంలోకి కేంద్రం
- త్వరలోనే దీశీయంగా క్యాబ్ సర్వీసులు
- కేంద్రహోంమంత్రి అమిత్ షా వెల్లడి




న్యూఢిల్లీ,మార్చి27(వార్త వేదిక సూర్య): ప్రస్తుతం దేశంలో గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్న ఓలా, ఉబెర్, ర్యాపిడో మిగతా 2లో..



## బొగ్గు బ్లాకుల వేలం ద్వారా రూ.40,960 కోట్లు పెట్టుబడులు

- ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- ఖనిజ, బొగ్గు రంగానికి సంబంధించి విజనరీ రోడ్ మ్యాప్
- తాజ్ హెూటల్‌లో జరిగిన 12వ కోల్ బ్లాక్ వేలం కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

ఢిల్లీ,(వార్త వేదిక సూర్య): బొగ్గు ఉత్పత్తిలో 1 బిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకున్న చరిత్రాత్మక సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ ఏడాదితో కోలిండియా 50వ వసంతంలోకి, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 175వ వసంతంలోకి అడుగు పెట్టిన మరో అద్భుత ఘట్టాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. ఈ విజయాలన్నీ గత పదేళ్లలో తీసుకున్న అద్భుతమైన పాలసీలు, సమష్టి కృషి కారణంగానే సఫలమైంది.

ఒకప్పుడు అవినీతి, కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బొగ్గు రంగం.. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అధునాతనంగా, పారదర్శకంగా మారి కొత్త పుంతలు తొక్కుతోంది. 2015లో వేలం ప్రక్రియను అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత ప్రైవేటు రంగం భాగస్వామ్యం, నూతన సాంకేతికత సాయంతో ఈ రంగం ముఖ చిత్రమే మారిపోయింది. ఇప్పటివరకు 125 బొగ్గు బ్లాకులను 11 దశల్లో విజయవంతంగా వేలం వేశాం. వీటిలో ప్రైవేటు రంగం కూడా భాగస్వామ్యం అయింది. ఈ వేలం ద్వారా ఏకంగా రూ.40,960 కోట్లు పెట్టుబడులు వస్తాయి. అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయి. మిగతా 2లో..

## 100% రుణమాఫీ జరిగితే రాజకీయాల్లో ఉండను


- ఇది నా చాలెంజ్.. ముఖ్యమంత్రి స్వీకరిస్తారా?
- తెలంగాణ పైన గన్ను ఎక్కుపెట్టిన రైఫిల్ రెడ్డి రేవంత్ రెడ్డి
- తెలంగాణ జాతి పిత ముమ్మాటికి కేసీఆర్
- తెలంగాణ బూతు పిత రేవంత్ రెడ్డినే
- పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు
- బయట మాట్లాడుతున్న రాము కరెక్టా? సభలో మాట్లాడుతున్న రెమో కరెక్టా?
- రేవంత్ ఒక్కడికే కుటుంబం ఉందా?
- ఉద్యోగుల డిఏకు పైసలు లేవు.. ఆరు గ్యారెంటీల అమలకు పైసలు లేవు
- కానీ వేల కోట్ల టెండర్లకు పైసలు ఎక్కడివి?
- ముఖ్యమంత్రి ఏమనుకున్నా మాకు ఫరక్ పడదు
- శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌పై విరుచుకుపడిన కెటిఅర్



హైదరాబాద్,మార్చి27(వార్త వేదిక సూర్య): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు మిగతా 2లో..

## విద్యార్థులకు శుభవార్త

### స్కాలర్‌షిప్స్, ట్యూషన్ ఫీజుల దరఖాస్తు గడువు మరోసారి పొడిగింపు




హైదరాబాద్,మార్చి27(వార్త వేదిక సూర్య): తెలంగాణలోని విద్యార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. స్కాలర్‌షిప్స్, ట్యూషన్ ఫీజుల దరఖాస్తు గడువు మరోసారి పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో ప్రస్తుత విద్యాసంవత్సరానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, ఈబీసీ విద్యార్థుల బోధన ఫీజులు, ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మే 31 వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను పకడ్బందీగా అమలు చేశాయి. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయి. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం 24 శాతం 19 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది. దక్షిణాది రాష్ట్రాలను నియంత్రించడానికి నియోజక వర్గాల పునర్విభజనను కేంద్రం వినియోగించుకుంటోంది. రాజకీయా లకు అతీతంగా దీనిపై ఒకే మాటపై నిలబడి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. అందుకే ఇవాళ సభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టాం.

ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ, తెలంగాణలో నియోజక వర్గాలను పునర్విభజన చేయాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మనపై వివక్ష చూపుతోంది. 2026 జనాభా లెక్కింపు తర్వాతే చేపడతామని ఆనాడు పార్లమెంట్ లో నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. జమ్మూ కాశ్మీర్ లో రాజ్యాంగాన్ని సవరించి 2011 జనభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను 83 నుంచి 90 కి పెంచారు.

సిక్కింలో 2018లో కేబినెట్ లో రిసొల్యూషన్ పాస్ చేసి, ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ప్రజల ముందుంచేందుకే సభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టాం. రాజకీయాలకు అతీతంగా పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిద్దాం. అవసరమైతే పోరాట బాట పడుదాం. త్వరలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి ఆధ్వర్యంలో అన్ని పార్టీలతో సమావేశం నిర్వహిస్తాం. ఈ సమావేశానికి అందరూ రావాలని విజ్ఞప్తి చేస్తున్నా.

# నేను తలచుకుంటే మీ ఖాందాన్ జైల్లో ఉండేది

(మొదటి పేజీ తరువాయి)

ఉండేవారు. డ్రోన్ ఎగరేస్తే రూ. 500 ఫైన్ వేస్తారు. కానీ అధికారం అడ్డుపెట్టుకుని ఎంపీగా ఉన్న నన్ను చర్లపల్లి జైల్లో పెట్టారు. 16 రోజులు నన్ను డిటెన్షన్ సెల్లో ఒక మనిషి కూడా కనిపించకుండా, మమ్మల్ని నిర్బంధించిన ఆ కోపాన్ని బిగపట్టుకున్నాం తప్ప, కక్ష సాధింపునకు పాల్పడలేదు. లైట్లు ఆన్ లోనే పెట్టి ఒక్క రాత్రి కూడా పడుకోకుండా జైల్లో గడిపేలా చేశారు. కరుడు గట్టిన నేరస్తున్ని బంధించినట్లు ఒక పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న నన్ను బంధించారు. వాళ్ల తప్పులను దేవుడు చూస్తాడు. అంతకు అంత అనుభవిస్తారు అనుకుని ఊరుకున్నా. నా మీద కక్ష చూపిన వారిని దేవుడే ఆసుపత్రిపాలు చేశాడు.

చర్లపల్లి జైలు నుంచి నా బిడ్డ లగ్నపత్రిక రాసుకోవడానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. రాజకీయ కక్ష సాధింపులంటే మీవి కదా? అయినా నేను కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదు. నిజంగానే నేను కక్ష సాధించాలనుకుంటే మీ కుటుంబమంతా చర్లపల్లి జైల్లో ఉండేవారు. కానీ ఆ పని నేను చేయలేదు.మేం విజ్ఞత ప్రదర్శించాం. ప్రజలు అధికారం ఇచ్చింది నా కక్ష తీర్చుకోవడానికి కాదని నేను విజ్ఞత ప్రదర్శించా. సొంతపార్టీ ఆఫీసులో బూతులు తీయించి రికార్డు చేయించినా, చెంపలు వాయించే శక్తి ఉన్నా నేను సంయమనం పాటించా. ఎవరివి కక్ష సాధింపు చర్యలో తెలంగాణ సమాజం ఇదంతా గమనిస్తోంది.

# ఇక ఖాతాకు నలుగురు నామినీలు

(మొదటి పేజీ తరువాయి)

అంశాలు ఇలా ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరిధిలోని బ్యాంకులు ఇప్పటివరకు ప్రతీ రెండో శుక్రవారం, నాలుగో శుక్రవారంలలో ఆర్‌బీఐకు రిపోర్టింగ్ చేసేవి. అవి ఇక నుంచి ప్రతినెలా 15న, 30న రిపోర్టింగ్ చేయాలి. ప్రభుత్వం వద్ద నమోదైన కంపెనీలలోని డైరెక్టర్ల కనీస వాటా మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచారు. డైరెక్టర్ హోదాలో ఉన్నవారు కంపెనీలోని 10 శాతం ఈక్విటీని కలిగి ఉండొచ్చు.

సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలాన్ని ఎనిమిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టరుగా (Bank Account Nominees) ఉండేవారు, రాష్ట్ర సహకార బ్యాంకు బోర్డులోనూ సభ్యుడిగా వ్యవహరించొచ్చు. ఆడిటర్లకు వేతనాల చెల్లింపులో బ్యాంకు లకు స్వేచ్ఛను కల్పించే నిబంధన సైతం సవరించిన చట్టంలో ఉంది.

### రుణాల ఎగవేతదారులపై కఠిన చర్యలు

ఉద్దేశపూర్వకంగా బ్యాంకుల అప్పు లను ఎగ్గొట్టే వాళ్లను వదిలేది లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తేల్చి చెప్పారు. వాళ్ల నుంచి అప్పులను వసూలు చేసేందుకు బ్యాంకులు తగిన చర్యలు చేపడతాయని స్పష్టం చేశారు. బ్యాంకుల అప్పులను 'రైట్ ఆఫ్' చేయడం అంటే మాఫీ చేసినట్టు కాదన్నారు. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024పై రాజ్యసభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ నిర్మల ఈ వివరాలను వెల్లడించారు.

# చెప్పిన మాటలను చేతల్లో చూపించిన రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన తెలంగాణ శాసన సభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి X (ట్విట్టర్) వేదికగా స్పందించారు.

న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ సరైన రీతిలో పునర్విభజన కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారని తమిళనాడు సీఎం పేర్కొన్నారు. చెన్నైలో ప్రతిపాదిం చిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయని, ఇది ఆరంభం మాత్రమేనని.. హైదరాబాద్‌లో ఐక్యకార్యాచరణ సమితి రెండో సమావేశం నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు అదే బాటలో నడుస్తాయని తమిళనాడు సీఎం అభిప్రాయపడ్డారు.

పునర్విభజన విషయంలో తమిళనాడును అనుసరిస్తూ, ఈ చర్య మన ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ భవిష్యత్తును అధర్మ మార్గాన ఒక ప్రాంతానికి అన్యాయం చేసే రీతిన రాసేందుకు ప్రయత్నించే ఎవరినీ అనుమతించబోమనిస్టాలిన్ స్పష్టం చేశారు.

# విద్యార్థులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి దరఖాస్తు ప్రక్రియ గడువు మార్చి 31తో ముగియనుంది. అయితే మరో మూడునెలలపాటు పొడిగించింది. ఇప్పటికే డిసెంబరు 31తో ముగియాల్సిన గడువును తర్వాత జనవరి 31 వరకు, ఆ తదుపరి మార్చి 31కి వరకు మరోసారి పొడిగించింది. తాజాగా మరోసారి అవకాశం కల్పించింది. కొన్ని ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశాలు ఆలస్యం కాగా, ఆయా ప్రవేశాల సమాచారం ప్రభుత్వానికి రావడంలో ఆలస్యమైంది. దీంతో అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. కొత్తగా కోర్సుల్లో చేరిన విద్యార్థులు దాదాపు 5 లక్షల మందికిపైగా ఉంటారని అంచనా. ఇప్పటికి 10 లక్షల వరకు దరఖాస్తులు అందాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మే 31 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2024-25 విద్యాసంవత్సరానికి 11,88,120 మంది విద్యార్థులకు గాను 10,34,074 మంది దరఖాస్తు చేశారు. ఎంబీబీఎస్, పీజీ మెడికల్ ప్రవేశాలు ఇంకా పూర్తికానందున విద్యార్థుల వివరాలను కాళోజీ వర్సిటీ ఎస్సీ సంక్షేమశాఖకు ఇవ్వలేదు. వివరాలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు దరఖాస్తు చేయడానికి వీల్లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి మే 31 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# 100% రుణమాఫీ జరిగితే రాజకీయాల్లో ఉండను

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుంది. ఈ సందర్భంగా కెటిఆర్, రేవంత్ రెడ్డి వాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీలో జరిగిన చర్చల్లో కెటిఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ముఖ్యమంత్రికి ఇంత అసహనం పనికిరాదు. ముఖ్యమంత్రికి ఇంత ఆవేశం, నిస్పృహ ఎందుకో అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రిలో ఒక అపరిచితుడు దాగి ఉన్నాడు," అని కెటిఆర్ వ్యాఖ్యానించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆర్థిక విధానాలపై కెటిఆర్ సూటిగా ప్రశ్నలు సంధించారు. "ఎవరు నమ్ముతలేరు.. అప్పు పుడుత లేదు.. దివాలా తీసినమని బయట చెప్తున్నారు. కానీ ఇక్కడికి వచ్చి లక్షా 58 వేల కోట్ల అప్పు చేసినానని రొమ్ము విరుచుకొని చెప్తున్నారు. బయట మాట్లాడుతున్న రాము కరెక్టా? సభలో మాట్లాడుతున్న రెమో కరెక్టా? రేవంత్ రెడ్డి చెప్పాలి," అని కెటిఆర్ డిమాండ్ చేశారు.

"దావోస్‌లో పెట్టుబడులు వరదలా తన్నుకొని వచ్చాయని చెప్పు కున్నారు. ఐదు గ్యారంటీలు అమలు చేశాము. సంక్షేమం అద్భుతంగా ఉందని చెప్పు కున్నారు. మరి 71 వేల కోట్ల ఆదాయం తగ్గిందని ముఖ్యమంత్రి ఎందుకు చెప్పారో వివరణ ఇవ్వాలి" అని ప్రశ్నించారు. ఉద్యోగుల డిఏకు పైసలు లేవు.. ఆరు గ్యారెంటీల అమలకు పైసలు లేవు.. తులం బంగారానికి పైసలు లేవు అని చెప్పే ముఖ్యమంత్రి... హెచ్ఎండిఏకు 20 వేల కోట్లతో టెండర్లు, ఏడు వేల కోట్లతో జిహెచ్ఎంసిలో టెండర్లు, వాటర్ వర్క్స్ లో 14 వేల కోట్ల టెండర్లు, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ లో 4400 కోట్లతో టెండర్లు, ఫ్యూచర్ సిటీలో ఆరు లైన్ల మెయిన్ రోడ్డు రెండు వైపులా రెండు సర్వీసు రోడ్ల మొత్తం 10 లైన్లకు 5000 కోట్లు. నిధులు ఎక్కడి నుంచి వచ్చినవి?" అని నిలదీశారు.

"లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ అని చెప్తారు. వీటన్నిటికీ డబ్బులు ఉన్నాయి. కానీ ఆరు గ్యారెంటీల అమలుకు పైసలు లేవా? తులం బంగారానికి పైసలు లేవా? మహిళలకు ఇచ్చేందుకు నెలకు 2500 లేవా?" అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కొడంగల్ నియోజక వర్గంలో గాని.. నా నియోజకవర్గం సిరిసిల్లలో కానీ ఏ ఊరికైనా వెళ్లి ఎవరైనా ఒక రైతును వందకు వంద శాతం రుణమాఫీ అయిందా అని అడుగుదాం. అయిందని చెప్తే నేను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటా. ఇది నా చాలెంజ్, ముఖ్యమంత్రి స్వీకరిస్తారా?" అని కెటిఆర్ సవాల్ విసిరారు.

డిసెంబర్ 7 న ఇందిరమ్మ రాజ్యం వస్తుంది. రెండు లక్షల రుణమాఫీ మీద 9 తారీకు సంతకం పెడతానని ముఖ్యమంత్రి చెప్పారు. మరి చేశారా? ఆనాడు పీసీసీ ప్రెసిడెంట్ గా రైతుబంధును ఆపిందే రేవంత్ రెడ్డి. ఎలక్షన్ కమిషన్కు రేవంత్ రెడ్డి స్వయంగా లెటర్ రాశారు. 7600 కోట్లు రైతుబంధు పైసల్ని ఆపి మా మీద దుష్ప్రచారం చేశారు" అని ఆరోపించారు.

100 రోజుల్లోనే 6 గ్యారెంటీలను అమలు చేస్తామని తొడలు కొట్టి అఫిడవిట్లు రాసి బాండ్ పేపర్లను దేవుళ్ళ ముందట పెట్టింది ఎవరు? వంద రోజుల్లోనే తులం బంగారం ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదు? ప్రజలు కాంగ్రెస్ నేతలని గోల్డ్ అనుకుంటే ఇప్పుడు వారు రోల్డ్ గోల్డ్ అని తెలిసిపోయింది. లంకె బిందెలు దొరికేదాకా ప్రజలు హామీల అమలు కోసం వేచి చూడాలా?" అని విమర్శించారు.

రేవంత్ ఒక్కడికే కుటుంబం ఉందా? నీతులు చెప్పేముందు తన చరిత్ర తెలుసుకోవాలి. రేవంత్ రెడ్డి లెక్కలు తప్పో, కాగ్ లెక్కలు తప్పో ముఖ్యమంత్రి చెప్పాలి. కాగ్ లెక్కల ప్రకారం నెలకు 2750 కోట్లు అసలు, మిత్తి కలిపి ప్రభుత్వం కడుతుంది. దొడ్డు వడ్లకు, ఇతర పంటలకు మద్దతు ధర, బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పింది.

ఇచ్చారా? మద్దతు ధర ఇస్తాం అన్నారు ఒక్కదానికైనా ఇచ్చారా? బోనస్ బోగస్ కాలేదా?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి ఇంటి మీదికి డ్రోన్ పంపిస్తే ఆయన ఊరుకుంటాడా? ఆయన భార్యాపిల్లల ఫోటోలను ఇష్టం వచ్చినట్టు తీస్తామంటే ఊరు కుంటాడా? ఇది పద్ధతేనా? మీకే భార్య పిల్లలు ఉన్నారా? వేరే వాళ్లకు భార్య పిల్లలు లేరా? వాళ్లకు కుటుంబాలు ఉండవా? లేని రంకులు అంటగట్టి ఆనాడు ఇష్టమున్నట్టు మాట్లాడినప్పుడు ఇష్టం ఉన్న సంబం ధాలు మాట్లాడినప్పుడు, ఆ రోజు నీతులు గుర్తుకు రాలేదా? మా ఇంట్లో పిల్లల్ని తిట్టింది ఈ కాంగ్రెస్ నేతలు కాదా? మా ఇంట్లోని మైనర్ పిల్లల్ని పట్టుకొని బూతులు మాట్లాడింది ముఖ్యమంత్రి కాదా?" అని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ముఖ్యమంత్రి ఏమనుకున్నా మాకు ఫరక్ పడదు

ముఖ్యమంత్రి ఏమనుకున్నా మాకు ఫరక్ పడదు. ఏం చేసినా ఫరక్ పడదు. పదవి, అధికారం శాశ్వతం అని ముఖ్యమంత్రి అనుకుంటున్నారు కానీ అవి ఏవీ శాశ్వతం కాదు. ముఖ్యమంత్రికి అపరిమిత అధికారాలు ఉండవు. ఆయన ఎవరిని జైలుకు పంపలేరు. కోర్టులు మాత్రమే ఆ పని చేయగలవు," అని కేటీఆర్ స్పష్టం చేశారు. "రేవంత్ తిట్లన్నీ మాకు దీవెనలే రేవంత్ రెడ్డికి తుపాలకుల గురించి బాగా తెల్సు. తెలంగాణ పైన గన్ను ఎక్కుపెట్టిన రైఫిల్ రెడ్డి రేవంత్ రెడ్డి. తెలంగాణ జాతిపిత ముమ్మాటికి కేసీఆర్ తెలంగాణ బూతు పిత రేవంత్ రెడ్డినే," అని కెటిఆర్ అన్నారు. "కాంగ్రెస్ ఎన్నో ప్రాజెక్టులు కట్టిందని చెపుతున్నారు కదా.. మరి 2014 ముందు ఇంత పంట దిగుబడి ఎందుకు లేదు? కేసీఆర్ వచ్చిన తర్వాతనే ఇంత దిగుబడి ఎలా సాధ్యం అయింది? అని కెటిఆర్ విమర్శించారు.

### పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు

పరిపాలన అంటే పంచ్ డైలాగులు కాదు. పదవిలోకి వచ్చిన తర్వాత ఇంత ఫ్రస్టేషన్ రేవంత్‌కు ఎందుకో తెలియడం లేదు. కాంగ్రెస్‌కు ఓటు వేద్దామంటే భయపడే పరిస్థితి రేవంత్ వల్లే తెలంగాణలో వచ్చింది. రేవంత్ ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో, తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేసినా వచ్చిన ఫలితం ఏమిటో ప్రజలకు తెలుసు. రేవంత్ రెడ్డి ఎన్ని రోజులు మాట్లాడితే అంత మంచిది. రేవంత్ మాటలు విన్నాక మరో 20 ఏళ్లు కాంగ్రెస్‌కు ఎవరూ ఓటు వేయరు" అని కెటిఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ తిట్లన్నీ మాకు దీవెనలే, ఆశీర్వాదాలే. తుపాకుల గురించి రేవంత్ రెడ్డికి బాగా తెలుసు. తెలంగాణపై గన్ ఎక్కుపెట్టిన రైఫిల్ రెడ్డి రేవంత్ రెడ్డే. పాత కాంగ్రెస్ నేతలను ఖతం చేసి పదవి లాక్కున్న వ్యక్తి రేవంత్‌రెడ్డి. విఫల పాలనకు విజయోత్సవాలు నిర్వహిస్తు న్నారు. అప్పులో, అబద్ధాల్లో, క్రైం రేట్‌లో, అన్నదాతలు, నేతన్నల ఆత్మహత్యల్లో తెలంగాణ ఈజ్ రైజింగ్,"అని కేటీఆర్ ఆరోపించారు.

# బొగ్గు బ్లాకుల వేలం ద్వారా రూ.40,960 కోట్లు పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

ఇవాళ 12వ ట్రాంచేలో భాగంగా 28 బొగ్గు, లిగ్నయిట్ బ్లాకులకు వేలం నిర్వహించాం. ఈ వేలం ప్రక్రియ ద్వారా బొగ్గు దిగుమతులు తగ్గడమే కాకుండా, విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడి, ఆత్మనిర్భర భారత్‌కు అసలైన నిర్వచనం ఇస్తున్నాయనడంలో సందేహం లేదు. ఉద్యోగాల కల్పన, సరుకు రవాణాకు ఈ రంగం ఊపిరులూదు తోంది. దీంతో జాతీయ ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. వేలం ప్రక్రియ ద్వారా ప్రైవేటు రంగ సంస్థలతో ప్రభుత్వ రంగ సంస్థలు పోటీ పడుతున్నాయి. దీంతో PSUల సమర్థత కూడా పెరుగుతోంది. ఇది ప్రపంచవ్యాప్తంగా పోటీ పడేందుకు దోహదపడుతుంది.

మహాకుంభ మేళా సందర్భంగా ఎన్ని అవాంతరాలు ఏర్పడినా బొగ్గు రంగం.. నిరంతరం శ్రమించి, దేశవ్యాప్తంగా బొగ్గు సరఫరా చేసి, అన్ని రంగాల విద్యుత్ అవసరాలను తీర్చింది. ఇప్పటికి కూడా దేశ వ్యాప్తంగా ఉత్పత్తి, స్టీలు రంగాల 72 శాతం విద్యుత్ అవసరాలను బొగ్గు తీరుస్తోంది. ఈ నేపథ్యంలో పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా సుస్థిర లక్ష్యాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. 2025 కేంద్ర బడ్జెట్‌లో దేశ ఖనిజ, బొగ్గు రంగానికి సంబంధించి విజనరీ రోడ్ మ్యాప్ రూపొందించాం. వ్యాపార అవకాశాలు, సృజనా త్మకత పెంపొందించేందుకు, స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు మైనింగ్, బొగ్గు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్, గనులను సొంతం చేసుకున్న వారి కోసం ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్, గనులకు స్టార్ రేటింగ్ వ్యవస్థ కూడా తీసుకొచ్చాం.

2030 నాటికి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా కోల్ గ్యాసిఫికేషన్ ప్రోగ్రామ్ తీసుకొచ్చాం. కోల్, లిగ్నయిట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు రూ.8 వేల కోట్లతో ఇన్సెంటివ్ స్కీం తీసుకొచ్చాం. సుస్థిరమైన మైనింగ్ కార్యకలాపాలు చేపట్టేందుకు నూతన విధానాలు అవలంబిస్తూ, నూతన సాంకేతికతలను వినియోగిస్తున్నాం. గత పదేళ్లలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా వేలం ప్రక్రియలో తొలిసారిగా బిడ్డింగ్ వేసిన 5 కంపెనీలు గనులను సొంతం చేసు కున్నాయి. అయితే గనులను సొంతం చేసుకున్న సంస్థలు త్వరితగతిన మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించడం చాలా కీలకం. మైనింగ్ ప్రక్రియ వేగవంతంగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుంది. అనుమతుల ప్రక్రియ సజావుగా, వేగంగా జరిగేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తున్నాం.

బొగ్గు గనుల్లో పెట్టుబడులు పెట్టడమంటే భారతదేశ ఎనర్జీ భవిష్యత్తు, ఆర్థిక వృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యోగ కల్పనలో పెట్టుబడులు పెట్టడమేనన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని కోరుతున్నాను.

# ఆర్థిక విధ్వంసం మొత్తం తవ్వి తీస్తా

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రజల ముందు పెట్టి వివరిస్తా..సంక్షేమమే మాకు ప్రాధాన్యత రంగం. రాబడి ఖర్చు ఏయే శాఖలకు ఎంత కేటాయింపులు అర్థవంతంగా అవసరాలకు తగిన విధంగా బడ్జెట్ రూపొం దించాం. ప్రజల పక్షాన నిలబడి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఈ ప్రభుత్వం పనిచేస్తుంది

మీ 10 సంవత్సరాల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, శ్రీ శిశు సంక్షేమం కోసం 70,474 కోట్లు కేటాయించి ఖర్చు చేయలేదు.. ఎస్సీ సబ్ ప్లాన్ కింద 50 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పారు మీరు చేయలేదు. మేం అధికారంలోకి రాగానే ఆర్థిక, సామాజిక, రాజకీయ సర్వే జరిపించాం. రాష్ట్రంలో 86% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమానికి మీరు నిధులు ఖర్చు చేయలేదని నిర్ధారణ జరిగింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే సంక్షేమం కోసం మొట్టమొదటిసారి రికార్డు స్థాయిలో కేటాయింపులు చేశాం. మూడు లక్షల 4 వేల కోట్ల బడ్జెట్లో 1,44,156 కోట్లు సంక్షేమం కోసం కేటాయించాం.మేం రాబడి నీ దృష్టిలో పెట్టుకొని ఆ మేరకే ఈ బడ్జెట్లో కేటాయింపులు చేశాం. 40 వేల కోట్ల బిల్స్ మీరు పెండింగ్లో పెట్టి పోయారు. ఉద్యోగుల బకాయిలు కాకుండానే 40 వేల కోట్లు పెండింగ్లో పెట్టారు. 1,59,940 లక్షల కోట్ల పనులు శాంక్షన్ చేసి పోయారు.. ఆ పనుల బిల్లులు పెండింగ్లో పెట్టి పోయారు.

ఉద్యోగులు రిటైర్ అయితే భారం మీపై పడుతుందని, మూడు సంవత్సరాలు పెంచారు. మొత్తం ఉద్యోగుల బకాయిలు 20వేల కోట్లు ఉండగా అందులో మేం 16 వేల కోట్లు క్లియర్ చేశాం. పాలనలో భాగస్వాములు ఉద్యోగులు.. వారిని పిలిచి బకాయిలకు సంబంధించి వివరాలు వెల్లడించి, రాబోయే రోజుల్లో వాటిని ఎలా క్లియర్ చేస్తామో ఉద్యోగులకు వివరించగా వారు సంతృప్తి చెందారు.మీరు లక్ష కోట్లు అప్పు తెచ్చి లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. మీరు తెచ్చిన అప్పులకు పదేళ్ల తర్వాత చెల్లిం పులు ప్రారంభంఅయ్యాయి.. ఆ లక్ష కోట్లు అప్పులు మాపై వదిలివేశారు. పెండింగ్ బిల్స్ రీపేమెంట్ భారం మా ప్రభుత్వం పైపడింది. మీలాగా 20% అంచనాలు పెంచకుండా వాస్తవిక బడ్జెట్ను ప్రవేశపెట్టాం. లక్ష మంది అధికారులతో నభూతో న భవిష్యత్తు అన్నట్టు కుల సర్వే చేశాం.. ప్లానింగ్ శాఖను నేనే చూస్తున్నాను. ఈ రాష్ట్ర వనరులు వెనుకబడిన పేద వర్గాలకు ఎలా పంచాలి అనే విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్యాబినెట్ కు కమిట్మెంట్ ఉంది. కాబట్టి సర్వే పూర్తి చేశాం.. వనరులు రాజకీయాల్లో జనాభా దామాషా ప్రకారం పంపిణీకి విశ్లేషణ చేస్తున్నాంమీలాగా దోపిడీ చేయడానికి రాజకీయాల్లోకి రాలేదు. ఈ సమాజంలో కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ పరిష్కారం కాలేదు. నిజమే వాళ్లకు వాటా దక్కాలని మా ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టింది.. దశాబ్దాలుగా పరిష్కరించని సమస్యను మా సీఎం యావత్ క్యాబినెట్ పరిష్కరించింది. కుల సర్వే ద్వారా స్టడీ చేసాం కాబట్టి సంక్షేమానికి నిధులు పెట్టాం అవి ఖర్చు పెట్టే బాధ్యత మా ప్రభుత్వానిది. ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరుతాం అందుకే బడ్జెట్లో 56,084 కోట్లు కేటాయించాం వాటిని తూచా తప్పకుండా అమలు చేస్తాం.

రాష్ట్రం వస్తే మేలు జరుగుతుందని నిరుద్యోగులు ఆత్మార్పణం చేసుకున్నారు. మా ప్రభుత్వం వచ్చాక 57,000 మందికి ఉద్యోగాలు ఇచ్చాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసాం. జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేసి తీరుతాం.

పదేళ్లుగా మీరు స్వయం ఉపాధి పథకాలను పట్టించుకోలేదు. నిరుద్యోగుల సమస్యలను అర్థం చేసుకున్న మేము 6000కోట్లతో స్వయం ఉపాధి పథకాలు ప్రవేశపెట్టాం.. బ్యాంకు లింకేజీ తో కలిపి మొదటి ఏడాది తొమ్మిది వేల కోట్లతో స్వయం ఉపాధి పథకాలు నిరుద్యోగులకు అందించబోతున్నాం.

వైశ్య కార్పొరేషన్ కి 25 కోట్లు, బ్రాహ్మణ పరిషత్ కు గతంలో 50 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్లో దానిని 100 కోట్లకు పెంచాం. ఎస్సీ సబ్ ప్లాన్ కు 40 వేల కోట్లు కేటాయించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచాం. మీ పాలనలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కి 10 సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరం సగటున 540 కోట్లు కేటాయిస్తే మేము మొదటి ఏడాదిలోనే 1205 కోట్లు కేటాయించాం.

ఓవర్సీస్ స్కాలర్షిప్ అడ్డగోలుగా శాంక్షన్ లీటర్లు మీరు ఇచ్చి వెళ్లారు.. ఎన్నికల కోసం మీరు శాంక్షన్ లెటర్లు ఇస్తే.. రాష్ట్ర బిడ్డల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విదేశాల్లో వారు ఇబ్బందులు పడొద్దని మేము 169 కోట్లు విడుదల చేశాం.. ఏడాది ఈ సంఖ్యను మరింత పెంచుతున్నాం.

మీ పాలనలో కాంట్రాక్టర్లకు ప్రతి ఏటా ఎస్టిమేట్లు పెంచి ఎప్పటి కప్పుడు బిల్లులు మంజూరు చేశారు తప్ప సంక్షేమ వసతి గృహాల పిల్లల డైట్ కాస్మోటిక్ చార్జీలను పట్టించుకోలేదు.. మేం అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ చార్జీలు 25% కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం.

మీ 10 సంవత్సరాల పాలనలో ఒక్క రెసిడెన్షియల్ స్కూల్ కూడా కట్టలేదు. మీ నాయకుల కోళ్ల ఫారాలు అద్దెకు తీసుకొని రేట్లు పెంచి, వారికి చెల్లింపులు చేశారు. మీరు ఆ హద్దులు ఏడాదికి 14 కోట్లు విడుదల చేస్తే మేము 126 కోట్లు సగటున సంవత్సరానికి విడుదల చేసాం.. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రే టెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి 11,600 కోట్లు కేటాయించాం. 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో ఈ స్కూల్స్ నిర్మిస్తున్నాం. మండల జిల్లా పరిషత్తు పాఠశాలలు బాగు చేయడానికి విద్యా కమిషన్ నియమించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం.విద్యార్థుల భవిష్యత్తు రాష్ట్ర భవిష్యత్తుగా భావించి కార్యాచరణ చేపట్టాం.

# ఆన్‌లైన్ క్యాబ్ బుకింగ్ సేవలకు కేంద్రం చెక్

(మొదటి పేజీ తరువాయి)

వంటి కంపెనీలకు చెక్ పెట్టేందుకు కేంద్రం సన్నద్ధం అవుతోంది. పబ్లిక్‌ట్రాన్స్ పోర్ట్ కేటగిరీలో సేవలను అందిస్తున్న ఈ కంపెనీలు ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతున్ఆయి. ఆన్‌లైన్ క్యాబ్ బుకింగ్ సేవల వ్యాపారంలో ఇవి గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తున్న సంగతి తెలిసిందే.

ఇవి ప్రజల నుంచి అధికంగా రేట్లు- వసూలు చేయటం నుంచి డ్రైవర్లకు తక్కువ చెల్లింపు వరకు అనేక ఆరోపణలను సైతం అందుకుంటు-న్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా వీటి గుత్తాధిపత్యానికి బ్రేక్ వేసే అతిపెద్ద ప్రకటన గురించి పార్లమెంటుకు వెల్లడించారు. మోదీ సర్కార్ రానున్న కొద్ది నెలల్లో క్యాబ్ సేవలను ఓలా, ఉబెర్ తరహాలోనే స్టార్ట్ చేసేందుకు సన్నాహాలు చేస్తోందని వెల్లడించారు. ఇందుకోసం సహకార టాక్సీ ఎ÷-లాట్ ఫారమ్ అందుబాటు-లోకి తీసుకొస్తున్నట్లు- ప్రకటించారు. ప్రజలు తమ టూవీలర్స్, త్రీవీలర్స్, ఆటోలు, కార్లను ఇందులో నమోదు చేసుకోవటం ద్వారా ప్రయోజనం పొందవచ్చని పార్లమెంటు-లో ప్రకటించారు. ఈ సహకార టాక్సీ ఎ÷-లాట్ ఫారమ్ నుంచి వచ్చే లాభాలు నేరుగా రిజిస్టర్ చేసుకున్న డ్రైవర్లకు వెళతాయని ఆయన అన్నారు. ఈ ప్రకటన ప్రైవేటు- సర్వీస్ ప్రొవైడ్లంల్గ÷న ఓలా, ఉబెర్, ర్యాపిడోలకు నిద్రలేకుండా చేస్తోంది. ఇప్పటికే ఓఎన్డీసీ వంటి ఓపెన్ ఫ్లాట్ ఫారమ్ ఆధారంగా బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన మెట్రో నగరాల్లో వివిధ యాప్స్ సదరు దిగ్గజ కంపెనీల పోటీ- ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థ రంగంలోకి దిగితే పోటీ- మరింత పెరుగుతుందని తెలుస్తోంది.

కానీ ప్రజలకు దీని వల్ల మెరుగైన సేవలు తక్కువ ధరలకు లభించే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ఇదే క్రమంలో కేంద్రం త్వరలోనే అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీని కూడా సహకార సంఘాల ఆధారంగా స్టార్ట్ చేయాలనే ప్రణాళికలను రచిస్తోందని అమిత్ షా వెల్లడించటం ప్రైవేటు- బీమా కంపెనీలను కుదిపేస్తోంది. ఓలా ఉబెర్ వంటి పెద్ద కార్పొరేట్ల హవాను రెయిడ్ హెయిలింగ్ వ్యాపారంలో నివారించటానికి ప్రయత్నాలు దీనికి ముందు 2017లోనే ఢిల్లీలో స్టార్ట్ అయ్యాయి. ఇందులో భాగంగా ఢిల్లీలోని టాక్సీ డ్రైవర్లు ప్రత్యేకంగా సేవా క్యాబ్ పేరుతో ముందుకొచ్చారు.

ఇదే తరహా చర్యలు కేరళ రాష్ట్రంలోనూ కనిపించాయి. అయితే ఇవి పెద్ద కార్పొరేట్లను ఎదుర్కొని నిలబటంలో సఫలం కాలేకపోయాయి.

అయితే కేంద్ర హోం మంత్రి ప్రకటించిన కొత్త యాప్ వీటి ఆధిపత్యాన్ని తట్టు-కుని నిలబడుతుందా లేక మట్టికరుస్తుందా అనే అంశం వేచి చూడాల్సిన విషయం. అయితే బెంగళూరు కేంద్రంగా స్టార్ట్ అయిన ఓఎన్డీసీ ఫ్లాట్ ఫారమ్ నమ్మ యాత్రి మాత్రం కొచ్చి, కలకత్తా, మైసూరు, హైదరాబాద్ వంటి నగరాలకు విస్తరించి ముందుకు సాగుతోంది.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

వార్తా వేదిక సూర్య దినపత్రికలో పదవి విరమణ, పుట్టినరోజు, ప్రకటనల కోసం
బహిరంగ ప్రకటనలు వ్యాపార ప్రకటనలు ఉద్యోగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు
కోసం ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు. 99853 89183, 95420 92183







## ఎమ్మెల్యే మురళీ నాయక్‌కు మంత్రిపదవి రావాలి..

**మహబూబాబాద్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌కు మంత్రిపదవి రావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, రాష్ట్ర బీసీ నేత శంతన్ రామరాజు ఆకాంక్షించారు. స్థానిక ముత్యాలమ్మ గుడిలో 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కమ్మగాని కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శంతన్ రామరాజు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోత్ రాములు నాయక్, సోమారపు వీరస్వామి, సిరిపురం వీరు, బంజెర వెంకట్ రెడ్డి, గోనె శ్యామ్, నరేష్ రెడ్డి, కోలా సత్యం, కొండి సాయికిరణ్ నేత, ఆల్వాల లాలయ్య, మల్లేష్, గుంజె హన్మంతు, గుగులోత్ చెక్రు, నారాయణ్ సింగ్తో పాటు ఎమ్మెల్యే మురళీ నాయక్ అభిమానులు పాల్గొన్నారు.

## ఉచిత యోగా శిక్షణ తరగతులు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ధంతలపల్లి, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
దంతాలపల్లి మండల కేంద్రంలోని పెద్దముప్పారం గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఆయుష్ మందిర్ వద్ద ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కావున ప్రజలు ఉచిత యోగ శిక్షణా తరగతులకు హాజరు కాగలరని



సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా. కిరణ్ కుమార్ తెలిపారు. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డీపీఎం శ్రవణ్ కుమార్, యోగా ఇన్స్ట్రక్టర్ అనిల్ మరియు ప్రతిరోజు ఈ యోగా క్లాసులను వినియోగించుకుంటున్న ఈగ శిరీష్, మురళి, నరేష్, యాకూబ్,కిరణ్, యామిని,సిద్ధులు పాల్గొన్నారు.

## వరల్డ్ వాటర్ డే

**చందానగర్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** వరల్డ్ వాటర్ డే సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మాదాపూర్ విద్యార్థులకు వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి అబ్రహాం ఆధ్వర్యం లో ఉపన్యాస,వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సింధు, ఫైజల్, భవ్య రాజేశ్వరి, హారిక, పవిత్ర, చిన్ను, అశ్వంత్, లక్ష్మి




కుమారికి బహుమతులు అందజేసి విద్యార్థులకు మాజా, బిస్కెట్స్ అందజేయడం జరిగింది. పిల్లల కు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు ఆవశ్యకత మనం చేపట్టే చర్యలు గురించి అవగాహన పరచడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు మోహన రావు, బాలమణి,సుధారాణి, లీలా దేవి, బాలమణి, లక్ష్మి దేవి, రాజగోపాల్ రెడ్డి, ప్రసాద్, మాధవి, ప్రేమ్ కుమార్, సారిక, నవ్య పాల్గొనడం జరిగింది.కార్యక్రమం నిర్వహించిన అబ్రహాం ను అభినందించడం జరిగింది.

**విలేకరులు కావలెను:**
వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాల బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్స్ మరియు నియోజక వర్గాల నుండి పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.
**అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును**
పూర్తి వివరాలకు సంప్రదించగలరు.
**పోలోజు శ్రీనివాసాచారి**
చైర్మన్ & ఎడిటర్.
**9985389183**





# విద్యాభివృద్ధిలో అధికారుల పాత్ర ఎంతో కీలకం

**- జిల్లా విద్యాధికారి సుసిందర్రావు**

**16 సంవత్సరాలుగా పని చేసిన ఎంఈవో వెంకటయ్య పదవీ విరమణ పాల్గొన్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ ఎమ్మెల్సీలు**

**మొయినాబాద్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
విద్యాభివృద్ధిలో అన్ని పాఠశాలలను సమానత్వం చేస్తూ విద్యార్థుల అభివృద్ధి కోసం 15 సంవత్సరాలుగా కృషి చేసిన రంగారెడ్డి జిల్లా లోని ఆయా మండలాల విద్యాధికారి అయిన వెంకటయ్య పదవీ విరమణ విద్యాభివృద్ధిలో ఆదర్శ అని జిల్లా విద్యాధికారి సుసిందర్రావు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, తెలంగాణ రాష్ట్ర ఎస్బిఎఫ్ అధ్యక్షులు యూ. పోచయ్యలు పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్నగర్ సమీపంలో గల పి.వి. కన్వెన్షన్ హాల్లో మండల విద్యాధికారి వెంకటయ్య పదవీ విరమణ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్బిఎఫ్ అధ్యక్షులు పోచయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాధికారి సుశిందర్రావు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీలు సుధాకరరెడ్డి, కె.జనార్ధన్రెడ్డిలతో పాటు రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు కృష్ణ, ఉపాధ్యక్షులు హిమాయత్నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో వెంకటయ్య దంపతులను సన్మానించారు. ముందుగా మాజీ ఎమ్మెల్సీలు జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించి సరస్వతీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా విద్యాధికారి సుశింద ర్రావు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు మాట్లాడుతూ విద్య అభి వృద్ధిలో భాగంగా పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి వెంక టయ్య అని తెలిపారు. మొయినాబాద్ మండలంలో 15 సంవత్స రాలుగా విద్యాధికారిగా పని చేస్తు రంగారెడ్డి జిల్లాలోని మొయి నాబాద్తో పాటు రాజేంద్రనగర్, గండిపేట్, శేరిలింగంపల్లి మండ లాలలో విద్యాధికారిగా పని అందరితో పేరు ప్రఖ్యాతలు పొందిన వ్యక్తి అని కొనియాడారు. వెంకటయ్య విద్యాభివృద్ధిలో చేసిన సేవలు ప్రభుత్వ, ప్రైవేటు అన్ని విద్యా సంస్థలు ఆయనను గుర్తించి పూలు, శాలువాలతో కుటుంబసభ్యులను సన్మానించడం అందరిని సంతోసి, పజేశారని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, రాష్ట్ర సర్పంచ్ల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్లు మాట్లాడుతూ వెంకటయ్య సేవలు అంతాఇంతా కాదని కొనియాడారు. 15 సంవత్సరాల పాటు అజీజ్నగర్, కనకమామిడి పాఠశాలలో ప్రధానో పాధ్యా యుడిగా కొనసాగుతూ మండల విద్యాధికారిగా సేవలు అందించి ఆయా మండలాలలో ఇన్చార్జ్గా పని చేయడం ఆయన ఓపిక అని తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో యూ. పోచయ్య, రవి యాదవ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దారెడ్డి వెంకట్రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి, రేణుకఅరుణ్కుమార్, చెన్నయ్య, రాంచంద్రయ్య, కొత్త మాణిక్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఆంజనేయులు, లక్ష్మారెడ్డి, అంజ య్యగౌడ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, మాజీ సర్పంచ్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

# క్రైస్తవులపై దాడులను ప్రభుత్వం అరికట్టాలి

**తొర్రూర్,మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
దేశం, రాష్ట్రములో దిన దినము క్రైస్తవ సంఘాలు, దైవ సేవకులైన పాస్టర్లపై జరుగుతున్న దాడులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని తొర్రూరు డివిజన్ మరియు తోరూర్ పాస్టర్లు ప్రభుత్వాలకు వినయపూర్వకముగా తెలియజేస్తున్నారు. గురువారం తోరూరు పట్టణ కేంద్రంలోని బిలీవర్స్ చర్చ్ లో ప్రార్థన ముగించుకున్న తర్వాత క్రైస్తవ పాస్టర్ లందరూ కలిసి పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై సంతాపం మరియు శాంతియుత నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు రెవరెండ్ నిరీక్షణ రావు ,పాస్టర్ బి, కృష్ణమోహన్, పాస్టర్ జాన్సన్, పాస్టర్ అబ్రహం ,నెల్లికుదురు మండల పాస్టర్ రాజేందర్ ప్రసాద్ లు మాట్లాడుతూ హైదరాబాద్ కి చెందినదైవ సేవకులు పాస్టర్ ప్రవీణ్ పగడాల రెండు తెలుగు రాష్ట్రాలు కాకుండా ఇతర దేశాలకు క్రీస్తు సువార్తను మోసకపోయే దైవజనుడని అన్నారు. అంతేకాకుండా అనాథ పిల్లలకు ఆశ్రయమిచ్చి, పోషించే వాడని, దిక్కులేని వారికి ,అండ ఆదరణ లేని వారికి ప్రవీణ్ పగడాల వారికి అండగా నిలిచి వారిని కాపాడే మంచి మనసున్న దైవజనుడు ప్రవీణ్ పగడాలని అలాంటి దైవజనుడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని
రాజమహేంద్రవరం లో అనుమాన స్థితిలో మృతి చెంది ఉన్నాడని చెప్పిన సంఘటన మా హృదయాలను కలిసి వేసిందన్నారు. వార్తాపత్రికలలో చానల్లో ఆయన హత్య చేయబడ్డాడని చెప్తున్న




సందర్భంగా ప్రవీణ్ పగడాలను హత్య చేసి ఉంటారని వారు తెలిపారు. నిజాన్నిదారణ కమిటీ వేసి దర్యాప్తు చేయాలని దోషులను కఠినంగా శిక్షించాలని వారి డిమాండ్ చేశారు.క్రైస్తవ లోకానికి ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని వారు వేడుకున్నారు. అది ప్రమాదము కాదని హత్య చేసి ఉంటారని
అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వెంటనే స్పందించి దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ప్రజాస్వామ్యంలో అందరం అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉంటున్నామని ఇలాంటి సంఘటన వల్ల క్రైస్తవులు భయాందోళనలో ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ శాంతియుత నిరసనలో తొరూరు అన్ని డినామినేషన్ పాస్టర్లు, డివిజన్లో ఉన్న అన్ని మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.






# వర్షపు నీటిని ఒడిసి పట్టుకొందాం - ఇంకుడు గుంతలు నిర్మించుకొందాం

**అభ్యుదయ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ ఎం. అశోక్**

**చందానగర్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
జలమండలి మరియు అభ్యుదయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవ సందర్భంగా జల సంరక్షణ మరియు ఇంకుడు గుంతల నిర్వహణ నిర్వాయించడం జరిగింది ఇందులో భాగంగా జయప్రకాశ్ నారాయణ నగర్ కాలనీలో ఇంకుడు గుంతల నిర్వహణ మరియు నీటి పొదుపు పై అవగాహనా కార్యక్రమంలో డీజీమ్ అమీరుద్దీన్ మాట్లాడు నీటి వృధాని అరికట్టాలని జల సంరక్షణ కుకృషి చేయాలని అన్నారు. మేనేజర్ సునీత మాట్లాతు ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భజలు పెంపొందించు కోవాలని కాలనీ వాసులకు తెలియ




జేసారు.ప్రెసిడెంట్ రామాంజనేయ రెడ్డి మాట్లాడుతూ జేపీ నగర్ లో వృధా నీటిని అరికట్టాలని తెలిపారు అభ్యుదయ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ మాట్లాడుతూ నగరవాసులకు నీటిని అందించేందుకు జలమండలి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుంది ఎండ కాలములో నీటి ఇబందులు ఎదురైవుతాయి కావున ఆ సమయములో మనం నీటిని కొంత పొదుపు చేసుకుంటున్నాయితే నీటికి ఇబందులు రాకుండ ఉంటాయాన్నారు పైపుతో ఎవరు వాహనాలను కడగం వంటివి మానుకోవాలని సూచించారు ఇంట్లో నల్లలకు లికేజీ లేకుండా చూసివాలని సొసైటీ మెంబెర్స్ కు చెప్పడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సొసైటీ మెంబర్స్ కాలనీలో ప్రజలు జలమండలి లైన్ మెన్స్ & స్టాఫ్ అభ్యుదయ సొసైటీ కోఆర్డినేటర్స్ సూర్య, విశ్వనాధ్ చారి. పాల్గొన్నారు.


# 19 ఏళ్ల యువకుడికి పునర్జన్మ ప్రసాదించిన వైద్య బృందం

**ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 35 లక్షలతో గుండె మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం**

**నిమ్స్ ఆసుపత్రిలో అరుదైన గుండె మార్పిడి**

**డాక్టర్ల బృందానికి ఎమ్మెల్యే ప్రశంసలు**

**మైలర్‌దేవ్‌పల్లి, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
నిమ్స్ ఆసుపత్రిలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ అమ్రేష్, డాక్టర్ గోపాల్ మరియు వారి వైద్య బృందం నేతృత్వంలో, యు.ఎస్.ఏ డాక్టర్ల సంయుక్త సహకారంతో 19 ఏళ్ల యువకుడు పూజారి అనిల్ కుమార్‌కు అరుదైన గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయం అని రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. తీవ్ర గుండె వ్యాధితో బాధపడుతున్న అనిల్ కుమార్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్న సమయంలో, వారికి మనోధైర్యం నింపుతూ, అనిల్ కుమార్‌ను డిసెంబర్ 3న నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 35 లక్షల ఎల్.ఓ.సి మంజూరై, గుండె మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తయిందన్నారు. ఈ శస్త్ర చికిత్సకు సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే డాక్టర్ శ్రీహరి కి, అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత మూడు నెలలుగా వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన వైద్య సేవలు అందించడంతో, మార్చి 8న గుండె మార్పిడి విజయవంతమైంది. ఆరోగ్యంగా కోలుకున్న అనిల్ కుమార్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అవుతున్న సందర్భంగా, ఆయన కుటుంబ సభ్యుల ఆనందం చూసి తనకు సంతోషం కలిగిందని



ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కోరారు.

# సెర్ఫ్ లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్
- పెండింగ్ కమీషన్ బకాయిలు ఐకెపి కేంద్రాలకు చెల్లించాలి
- స్టిచ్చింగ్ కేంద్రాల ద్వారా ప్రైవేటు ఆర్డర్లు సైతం చేపట్టాలి
- నవంబర్ వరకు జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం పూర్తి చేయాలి
- సెర్ఫ్ కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన పంచాయతీరాజ్ కార్యదర్శి



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, మార్చి 27(వార్త వేదిక):** సెర్ఫ్ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, సెర్ఫ్ కార్యక్రమాల పై సెర్ఫ్ సీఈఓ డి.దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి తో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో సెర్ఫ్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకెపి కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్య మంత్రి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33 శాతం ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకెపి లకు బదిలీ చేయాలని, అదనపు వరి ధాన్యం దిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలచే ప్రారంభించాలని కలెక్టర్ లకు తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమీషన్ మహిళా సంఘాలకు అందడం లేదని దీనిపై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమీషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. పౌర సరఫరాల శాఖ, సెర్ఫ్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి. కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు.

నిర్ధారణ క్యాంపుల నిర్వహణ కోసం ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వృద్దులు ఎవరైనా మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ లకు సూచించారు. డిఆర్డిఓ, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమీషనర్లతో సమావేశం నిర్వహించి ఇటువంటి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. 3 నెలలు ఫించన్ తీసుకోని లబ్దిదారులు వలస వెళ్లినట్లు సిస్టమ్ నమోదు చేస్తుందని అన్నారు. వలస వెళ్లినట్లు నమోదు అయిన వివరాలను అధికారులు పరిశీలన చేసుకొని పెన్షన్ తీసుకోక పోవడానికి గల కారణాలు తెలుసుకోవాలని, లబ్ధిదారులు మరణిస్తే వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి స్కూల్ యూనిఫాం కుట్టు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టు పనులకు సంబంధించి అవసరమైన కటింగ్ మిషన్, ఇతర పరికరాలు సిద్ధం చేసుకోవాలని, మహిళా సంఘాల ద్వారా కుట్టు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని, జూన్ నెల వరకు ఈ పనులు పూర్తి కావాలని అన్నారు. స్కూల్ యూనిఫామ్ కుట్టు పనులకు సంబంధించి కూలీ క్రింద 50 రూపాయలు మాత్రమే వచ్చినట్లు మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారని, దీనిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పరిశీలన చేసి పెండింగ్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు సమర్పించేలా చూడాలని, ప్రభుత్వానికి సమర్పించిన ప్రతి బిల్లు చెల్లింపు పూర్తవుతుందని అన్నారు. స్వశక్తి మహిళ సంఘాల ద్వారా సృష్టించబడిన స్టిచ్చింగ్ సెంటర్‌లు పూర్తి స్థాయిలో వినియోగించేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు యూనిఫామ్ కుట్టిన తర్వాత ప్రైవేట్ గా కూడా కుట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందుగా జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల స్థాయిలలో కూడా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కార్యాచరణ ఉంటుందని ఆయన అధికారులకు తెలిపారు. మహిళలచే చేపట్టే పెట్రోల్ బంక్ లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న హోటల్ ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉండాలని అన్నారు. మహిళా శక్తి మాల్స్ ఏర్పాటు కూడా అవకాశాలు కల్పించాలని అన్నారు. జిల్లా సమాఖ్య భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ కింద షాప్స్ ఏర్పాటుకు ప్రతి జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ లలో ప్రజలకు అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉండాలని, బజార్ ఎల్లప్పుడూ ప్రజలతో కిటకిటలాడేలా ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలలో వివిధ సమయాలలో నిర్వహించిన తనిఖీలలో అవకతవకలు గమనించి లైసెన్స్ రద్దు చేసిన పెట్రోల్ బంక్ లను మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రమాద బీమా, సాధారణ బీమా పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని, మరణించిన మహిళా సంఘాల సభ్యుల సరైన డాక్యుమెంట్ లను పరిశీలించి సరైన లబ్ధిదారులకు ఈ సహాయం అందేలా చూడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించి జిల్లాలో ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు మరణించారు. వారిలో ఎంత మందికి ప్రమాద బీమా, సాధారణ భీమా అమలు అవుతుంది పరిశీలించి సంబంధిత లబ్ధిదారులకు సహాయం అందజేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, డిఈఓ సత్యనారాయణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## ఆర్థిక సాయం అందజేత

**వలిగొండ, మార్చి 27 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన కందుల ముత్తిలింగమ్మ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలిసిన వెంటనే ఏజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి తన టీం తో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ల రేపాక గ్రామ ప్రజలు, ఏజేఆర్ ఫౌండేషన్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎంఏ మజీద్ ఏకగ్రీవ ఎన్నిక



**రామన్నపేట, మార్చి 27(వార్తా వేదిక సూర్య):** రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రముఖ సీనియర్ న్యాయవాది ఎంఏ మజీద్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గురువారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్ లో బార్ అసోసియేషన్ సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల చీఫ్ ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది వై కృష్ణారెడ్డి, ఎన్నికల అధికారిగా దంతూరి సత్తయ్య వ్యవహరించారు. ఉపాధ్యక్షులుగా యాదాసు యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా నకిరేకంటి మొగులయ్య, సంయుక్త కార్యదర్శిగా సంగిశెట్టి బాలరాజు, కోశాధికారిగా బి డేవిడ్, క్రీడ సంస్కృతిక కార్యదర్శిగా బి దినేష్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా యేల్ల శ్రీశైలం, నోముల స్వామి, కునూరు శ్రీనివాస్, గుంటోజు కనకాచారి ఎన్నికయ్యారు.

# ప్రజలకు ఆపదొస్తే అండగా నిలిచేది కమ్యూనిస్టులే..

### సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్

**రామన్నపేట :మార్చి 27 (వార్తా వేదిక సూర్య):**

నిరంతరం పేద ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజలకు ఆపద వస్తే అండగా నిలిచేది కమ్యూనిస్టులేనని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. సిపిఎం ప్రజా చైతన్య పాదయాత్రలో భాగంగా రామన్నపేట మండలంలోని నీర్నెముల గ్రామంలో బుదవారం రాత్రి జరిగిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అధికారంలోకి రావడం కోసం ప్రజల ఓట్ల కోసం తప్ప ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏ ఒక్క పార్టీ కృషి చేయడం లేదని ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతరం ప్రజలతో మమేకమై ఆపద వస్తే వారికి అండగా నిలిచేది ఎర్రజెండా నేనని అన్నారు.పాలకవర్గాలు ప్రజలను కేవలం ఓటర్లుగానే చూస్తున్నారని విమర్శించారు. చట్టసభల్లో ప్రజా సమస్యల గురించి ప్రస్తావించే నాయకులు లేరని ఏ గ్రామానికి వెళ్లిన సమస్యలు కోకోల్లలుగా ఉన్నాయని, అనేక ఆశలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నారని అన్నారు.

పోరాడే వారికే గ్రామాలలో పట్టం కట్టే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టులకు అవకాశాలు ఇవ్వాలని ప్రజల్ని కోరారు.పల్లె పల్లె తిరిగి ప్రజా




సమస్యల్ని అధ్యయనం చేసే మండల నాయకత్వానికి అభినందనలు తెలిపారు.

ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి పాలన చేస్తున్నదని సిపిఎం తెలంగాణ రాష్ట్ర గ్రామ సభ్యులు పైల ఆశయ అన్నారు వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ ల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని రైతు రుణమాఫీ,రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహాలకు ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు పంపిణీ చేయలేదని మహాలక్ష్మి పేరిట 2500 ప్రతి మహిళకు ఇస్తామని చెప్పి వాటి కోసం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం హామీలుగానే ఇచ్చారని విమర్శించారు

పాదయాత్ర బృందం గ్రామంలో పర్యటించి పలు సమస్యలను పరిశీలించడం జరిగింది గ్రామ ప్రజలందరికీ మంచినీటిని అందించే ట్యాంకులు మెట్లు లేక గత రెండు సంవత్సరాల నుండి శుభ్రతకు కు నోచుకోలేదని ట్యాంకుల పైన మూతలు లేకపోవడంతో కోతులు అందులోనే స్థానాలు చేస్తూ కలుషితం చేస్తున్నాయని అట్టినీటినే గ్రామ ప్రజలందరూ స్నానాలకు భోజనం వండుకోవడానికి వాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు అలాగే నుండి కొత్తగూడెం వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆసిఫ్ నగర్ 100 సంవత్సరాలకు పైబడిన ఆలాద్రి బ్రిడ్జి నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, తలుపుల వద్ద నూతన బ్రిడ్జి వంతెన నిర్మించాలని పాదయాత్ర బృందం డిమాండ్ చేయడం జరిగింది.

నీర్నెముల శాఖ కార్యదర్శి నాగటి అంజయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పాదయాత్ర బృందం రథసారధి జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం బోయిని ఆనంద్ కందుల హనుమంతు గొరిగి సోములు గన్నెబోయిన విజయభాస్కర్ వేముల సైదులు మేడి గణేష్ చానకొండ రాము బొడిగ రజిత కొమ్ము అంజమ్మ మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్ బల్గూరి అంజయ్య మండల కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరు నగేష్ సిపిఎం గ్రామ శాఖ నాయకత్వం బండ జగన్మోహన్ రెడ్డి,బోయిని మల్లేశం, నాగటి లక్ష్మణ్, నాగటి మహేష్, బల్లెం సత్తయ్య,ఆవులమల్లేష్ ఏశబోయిన రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న రెడ్‌క్రాస్ చైర్మెన్ గుఱ్ఱం లక్ష్మీనర్సింహ్మా రెడ్డి




**మోత్కూరు మార్చి 27 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ఆరోగ్య సేవలు, ఉచిత మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు విద్యార్థులకు ఉచిత పుస్తకాలు యాడ్లు పెన్నులు, వృద్ధ ఆశ్రమాలకు సహాయం అందించడం పర్యావరణ పరిరక్షణ వంటి ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు అందిస్తున్న మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గుర్రం లక్ష్మి నర్సింహ్మా రెడ్డికి గురువారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జిల్లా రచయిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారం కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ చేతుల మీదుగా ఉగాది సేవ పురస్కారం అందుకున్నారు. ఈ పురస్కారం అందుకున్న డాక్టర్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మోత్కూరు లో విలేకరులతో మాట్లాడుతూ తాను సంపాదించిన దానిలో సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలని తపనతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. తనపై నమ్మకంతో అవార్డు గ్రహీతగా ఎంపిక చేసిన జిల్లా రచయిత సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాలపై తనపై నమ్మకం పెట్టుకున్న ప్రజలకు ఎప్పటికీ అందుబాటులో ఉండి సహకరిస్తానని తెలిపారు. ప్రజలకు సేవ చేయడంతోనే నాకు అవార్డు అందిందని ఈ అవార్డు మరింత బాధ్యతగా పెంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు, స్థానిక ప్రముఖులు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని లక్ష్మీనర్సింహ్మా రెడ్డిని అభినందించారనీ చెప్పారు. లక్ష్మీ నరసింహా రెడ్డి అవార్డు రావడం పై స్థానికులు వ్యవసాయ మార్కెట్ మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి,బయ్యాని రాజు ,బీసు మత్స్య గిరి గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

ఇలాంటి సేవలు మరింత కొనశాసించాలని ....భవిష్యత్‌లో ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు.

# పాఠశాల విద్యార్థులకు కంపాక్స్ బాక్సులు పంపిణీ

**వలిగొండ మార్చి 27 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని నాగారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ భాస్కర్ సౌజన్యంతో కంపాక్స్ బాక్సులు గురువారం




అందజేశారు.

ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యా ప్రమాణాలు పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతి ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీవన జ్యోతి, ఉపాధ్యాయులు జిలాని, స్వామీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పూసల కులస్తుల సమస్యలపై కృషి చేస్తా..

**మోత్కూరు: మార్చి 27 (వార్త వేదిక సూర్య):** పూసల కులస్థుల ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని పూసల కులస్తుల కమిటీ నూతన అధ్యక్షుడు పొదిల్ల సత్యనారాయణ అన్నారు. గురువారంనాడు జిల్లా అధ్యక్షుడు బత్తుల సింహాద్రి, ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మర్రి కమలాకర్, ఉపాధ్యక్షులు మున్నూరు శోభ, కోశాధికారి పొదిల్ల వాసు,సంయుక్త కార్యదర్శి చేని శ్రీనివాస్ లను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు సత్యనారాయణ ప్రకటించారు.




## శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట


**తేదీ : 27-03-2025, గురువారం**

**శ్రీస్వామి వారి ఆదాయము రూ: 39,62,875/-**

**శ్రీ స్వామి వారికి 1400 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.**

| | | |
|---|---|---|
| కళ్యాణ కట్ట | - | 70,000/- |
| ప్రధాన బుకింగ్ | - | 81,300/- |
| కైంకర్యములు | - | Nill/- |
| సుప్రభాతం. | - | 6,400/- |
| బ్రేక్ దర్శనం. | - | 96,600/- |
| వ్రతాలు | - | 77,600/- |
| వాహన పూజలు | - | 5,600/- |
| VIP దర్శనం | - | 1,35,000/- |
| ప్రచారశాఖ | - | 12,800/- |
| పాతగుట్ట | - | 10,600/- |
| కొండపైకి వాహన ప్రవేశం | - | 1,97,000/- |
| యాదఋషి నిలయం | - | 52,172/- |
| సువర్ణ పుష్పార్చన | - | 35,916/- |
| శివాలయం | - | 4,800/- |
| శాశ్వత పూజలు. | - | 20,000/- |
| పుష్కరణి | - | 850/- |
| ప్రసాదవిక్రయం | - | 8,23,400/- |
| లాకర్స్ | - | 240/- |
| అన్నదానం | - | 40,025/- |
| విమాన గోపురం | - | Nill/- |
| లీజెస్ | - | 22,92,572/- |
| ఇతరములు | - | Nill |






## ప్రజా సమస్యలపై ఉద్యమిస్తే అరెస్ట్ లా..?

**ఇబ్రహీంపట్నం, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** పేద ప్రజల సమస్యల పరిష్కారణకై ఉద్యమాలు నిర్వహిస్తున్న సి.పి.ఎం. రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీను అక్రమంగా అరెస్టు చేశారని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు, మండల కమిటీ సభ్యులు కురుమేటి యాదయ్యలు అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్ పల్లి గ్రామంలో 189,203 సర్వే నెంబర్లలో 577 మంది పేద ప్రజలకు దిగంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో ఇంటి స్థలాలు మంజూరైయ య్యాని ,ఈ భూములను రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం కబ్జా చేయడంపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 26న అక్కడ నిరసన చేస్తున్న సిపిఎం నేతలపై పోలీసులు లాటి చార్జ్ చేయ



డంతో పాటు ఆందోళన కార్యక్రమానికి బాసటగా వెళ్లిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని వారు గురువారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో త్రీవంగా ఖండించారు. పేదల సమస్యలపై సి.పి.ఎం పార్టీ ప్రతినిత్యం పోరాడుతుందని అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు.

## మోత్కూరు బ్రహ్మచారికి ప్రకృతి రత్న అవార్డు పురస్కారం

**మోత్కూరు, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
ఆవు మూత్రం, పేడ ప్రకృతిలో లభించే వనరులతో చేస్తున్న సాగు విధానం పై రైతులకు తాను చేస్తున్న సేంద్రియ వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించ డాన్ని ఆంధ్రప్రదేశ్ లోని ఎన్. టి.ఆర్.జిల్లా పెనుగంచి ప్రోలు మండల కేంద్రంలో వ్యవసాయ సదస్సు"లో ప్రకృతి రత్న పురస్కారం ఏ.పి.మాజీ మంత్రి నెట్టెం రఘురాం, పద్మశ్రీ అవార్డు గ్రహీత రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మెన్ వై.వెంకటేశ్వర రావు చేతుల మీదుగా అందు కున్నట్లు మోత్కూరు పట్టణానికి చెందిన సేంద్రియ రైతు మోత్కూరు బ్రహ్మచారి తెలిపారు. తన సేవలను




గుర్తించి ప్రకృతి రత్న పురస్కారం లభించడంపై బ్రహ్మచారి సంతోషం వ్యక్తం చేశారు. బ్రహ్మచారికి ప్రకృతి రత్న అవార్డు రావడం పట్ల పట్టణానికి చెందిన వివిధ సంఘాల నాయకులు బయ్యని రాజు, పట్టూరి అంజయ్య, కోమటి మత్స్య గిరి, మర్రి ఆనందం, సజ్జనం మనోహర్ , రాము హర్షం వ్యక్తం చేశారు.

## బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షులుగా శివార్ల శ్రీనివాస్ యాదవ్ నియామకం

**మోత్కూరు, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** బీసీ రిజర్వేషన్ సాధన సమితి"లో పని చేస్తున్న మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన శివార్ల శ్రీనివాస్ యాదవ్ ను బీసీ రిజర్వేషన్ సాధన సమితి ( బి.ఆర్.ఎస్.ఎస్.) మోత్కూరు మండల అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం నాడు ఈ మేరకు శ్రీనివాస్ యాదవ్ కు శ్రీనివాస్ గౌడ్ నియామక



పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్నా సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ కు, తన నియమాకానికి సహకరించిన జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత లకు కృతజ్ఞతలు తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**వలిగొండ మార్చి 27 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని సుంకిశాల గ్రామానికి చెందిన పోలేపల్లి బాలమ్మ ఇటీవల మృతిచెందగా గురువారం పైళ్ల సత్యనారాయణరెడ్డి రమణమ్మల జ్ఞాపకార్థం పైళ్ల వెంకటరెడ్డి శాలిని దంపతులు



మృతురాలి కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పైళ్ళ రాజ వర్ధన్ రెడ్డి, వరకాంతం రాజేందర్ రెడ్డి, మారోజు పాండు రంగయ్య, తుమ్మల సత్యనారాయణ రెడ్డి, పరిపూర్ణ చారి, మొగిలిపాక నరసింహ, పోలేపల్లి స్వామి, పోలేపల్లి హంసమ్మ, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

**వలిగొండ మార్చి 27 (వార్తా వేదిక సూర్య):**
మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి గురువారం దేవస్థానం ఆవరణలో దేవాలయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఇనిస్పెక్టర్ వెంకటలక్ష్మి శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ రెడ్డిలు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధి కోసం నూతన పాలకమండలి కృషి చేయాలని దేవాలయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్రీరామనవమి, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించి దేవాలయ ప్రతిష్టను పెంచాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం చైర్మన్ గంజి అశోక్, డైరెక్టర్లుగా ఎడవెల్లి శివలక్ష్మి, రవ్వ నరేందర్, కల్వల లింగస్వామి, మల్లం హరిప్రసాద్, పోగులకొండ ఆదిత్య శర్మ లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ఉక్కుర్తి స్వామి, గ్రామ మాజీ సర్పంచ్ పసల అన్నా మేరీ శౌరి, బత్తెపు అంజయ్య, మల్లం శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి సత్తమ్మ యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ కల్కూరి చంద్రయ్య, వలిగొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉక్కుర్తి చంద్రయ్య, బూడిద పాపయ్య, బూడిద బిక్షమయ్య, ఎడవల్లి మల్లేశం, పరకాల ముత్యాలు, పిట్టల గణేష్, నానమాల ఉప్పలయ్య, గంజి రామకృష్ణ, చిట్టోజు వెంకట నారాయణ చారి, సీత శంకర్, బొమ్మ నరసింహ, కొడితల విజయ, బైరు సైదులు గౌడ్, కల్కూరి హరికృష్ణ, బూడిద సుగుణమ్మ నరసింహ, ఎడవల్లి నరసింహ, కడవేరు యాదగిరి, వేముల మణికాంత్, చేగూరి హరిప్రసాద్, బొడిగ చంద్రమౌళి, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## డూప్లికేట్ ఇక్కత్ వస్త్రాలను అరికట్టాలి

### కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాసిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** డూప్లికేట్ తయారు చేస్తున్న పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను అరి కట్టి, వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. గురువారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ కు చేనేత కార్మికుల సమస్యలపై లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదివేల రూపాయల విలువ గల పోచంపల్లి చేనేత పట్టుచీరను 600 రూపాయలకే నకిలీ పట్టుచీరలు విక్రయిస్తున్నారని, డూప్లికేషన్ ఇక్కత్ చీరలతో మార్కెట్ దెబ్బతింటుందని, దీంతో చేనేత కార్మికులకు ఉపాధి కరవుతుందని పేర్కొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ చీరల నకిలీలను నిరోధించేందుకు 100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని , ఈ ఫండ్ ద్వారా వచ్చే వడ్డీతో ఒరిజినల్ పోచంపల్లి చేనేత చీరలను ట్యాగ్ చేయాలని ప్రచార మాధ్యమాల్లో బ్రాండ్ అంబాసిడర్ ద్వారా విస్తృతమైన ప్రచారం చేపట్టాలని కోరారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ రిజిస్ట్రీ ( జి ఐ ఆర్ ) కింద నమోదుకు రక్షణ లేకుండా పోయిందని దీంతో




కార్మికుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని అన్నారు.

## నారాయణపురం మండల కేంద్రంలో మజీద్‌లో రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు



**నారాయణపురం మార్చి 27(వార్త వేదిక సూర్య):** సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలోని మహిబు మియ మాజిద్‌లో రంజాన్ మాసం సందర్భంగా అషం పరుక్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సయ్యద్ జంగిర్ కుమారుడు వాజిద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాజిద్ మాట్లా డుతూ నా సొంత గ్రామంలో రంజాన్ విందులో పాల్గొనడం నాకు చాలా సంతోషంగా ఉంది అన్నారు. మా గ్రామంలోని పెద్దలు నన్ను ఆప్యాయంగా పలకరించాడు చిన్న నాటి జ్ఞాప కాలు గుర్తు చేసుకుంటూ ప్రతి ఒక్కరినీ పలకరించాడు రాబోయే రోజుల్లో మాజిద్‌కు న వంతు సహాయం చేస్తాను అన్నారు. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమం ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి : ఏఐవైఎఫ్

**మోటకొండూరు/వార్తా వేధిక సూర్య:**
అఖిలభారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) మోటకొండూర్ 3వ మండల మహాసభ మండల అధ్యక్షులు బీరకాయల మధు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటు




వంటి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లంకి మహేష్ పెరబోయిన మహేందర్ లు మాట్లాడుతూ మూటకొండూర్ మండలంలో నిరుద్యోగ సమస్య చాలా ఇబ్బందికరంగా ఉన్నదని మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఉన్నటువంటి ప్రీమియర్ ఎక్స్లోజీవ్ కంపె నీలో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్తో పాటు జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించింది కానీ నేటి వరకు అమలు చేయలేదు అని అన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని అన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్య నారాయణ మాట్లాడుతూ కేంద్రంలో అటు బిజెపి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీ పోస్టులు ఉన్న నియామకాలు మాత్రం చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. పాలకుల అనుసరిస్తున్న తీరుపై నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి ఉందని అన్నారు.

అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగినది. గౌరవ అధ్యక్షులుగా ఆలేటి బాలరాజ్, అధ్యక్షులుగా బీరకాయల మధు, ఉపాధ్యక్షులుగా గట్టి పాముల సునీల్, మారబోయిన దేవరాజ్, ప్రధాన కార్యదర్శిగా బోలగాని




అశోక్, సహాయ కార్యదర్శిలుగా మంచాల మచ్చ గిరి, ఇందిరియాల రేవతి, కోశాధికారిగా గట్టి కొప్పుల శ్రీకాంత్, గంధ మల్ల రాకేష్, బీరకాయల గణేష్, తోపాటు 21 మంది కౌన్సిల్, 9 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గాధగని మాణిక్యం, నల్ల రాములు, బోగారం పాండు, సాయి కుమార్, శ్రీనివాస్, రమేష్, వినయ్ కుమార్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు నాణ్యత విలువలు పాటించడం లేదని మున్సిపల్ కమీషనర్‌కు వినతి

**మోత్కూరు, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
మోత్కూరు మున్సిపాలిటీ రోడ్డు అభివృద్ధి పనులలో మెయిన్ రోడ్‌లో మోరీలు పార్కింగ్ రోడ్డుపై ఆర్.టి.ఐ. 2005 చట్ట ప్రకారం సమాచారం ఇవ్వాలని డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నాడు మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయ కులు మాట్లాడుతూ పట్టణంలో 500 మీటర్ల సిసి రోడ్డుపై డాంబర్ రోడ్డు వేయడం వల్ల నాణ్యత లోపం జరిగే అవకాశం ఉందని, ఆ బిల్లును వెంటనే నిలిపివేయాలన్నారు. మున్సిపల్ చట్ట ప్రకారం రోడ్డు పట్టణంలో వైడింగ్ ఎన్ని ఫీట్లు వెడల్పు ఉండాలి ,ఎన్ని ఫీట్లు వేశారని, మునిసిపాలిటీలో అభివృద్ధి పనుల కొరకు ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించిందో తెలపాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ వినియోగదారుల సంఘం అధ్యక్షులు గుమ్మడవెల్లి పరుశరాములు, ఉపాధ్యక్షులు ఊర సారయ్య, సోషల్ మీడియా ఇంఛార్జి మర్రి కమల్ నాథ్, సభ్యులు ముక్కెర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవ కమిటీ సభ్యుడిగా డా.కంకల ఏలేందర్ కురుమ

**మోటకొండూరు/వార్త వేధిక సూర్య:**
తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జయంతిని ఏప్రిల్ 3న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. ఈ కమిటీలో యాదాద్రి జిల్లా మూటకొండూరు మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు,కురుమ ముద్దుబిడ్డ డాక్టర్ కంకల ఏలేందర్ ను దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవ కమిటీ సభ్యునిగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తనవంతు పాత్ర పోషించినందుకు ఉత్సవ కమిటీ



సభ్యునిగా ప్రభుత్వం నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కి,బిసి సంక్షేమ సంఘానికి,కురుమ సంఘానికి కృతజ్ఞతలు తెలిపాడు. నాకు అప్పగించినందులకు పెద్దఎత్తున ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

## జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**మోత్కూరు, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులు ఎంతో కృషి చేశారని వారి కష్టాన్ని చూసి నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రంలో జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయిస్తే నేడు కాంగ్రెస్ పార్టీ నాన్చుడి ధోరణి అవలంబిస్తుందని బి.ఆర్.ఎస్ జిల్లా నాయకులు బందెల శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మోత్కూరులో విలేక రులతో మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వా నికి మధ్య వారధిగా ఉంటూ ప్రతినిత్యం ప్రజా సమస్యల కోసం తన కలంతో గళం విప్పుతున్న జర్నలిస్టులకు వెంటనే గత ప్రభుత్వ హాయంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలు వారికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.



## ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి

### యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వర్కాల భానుచందర్ గౌడ్

**భూధాన్ పోచంపల్లి,మార్చి 27(వేదిక వేదిక సూర్య):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకానికి అర్హులైన వారందరూ ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వర్కాల భాను చందర్ గౌడ్ కోరారు. గురువారం ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక నిరుద్యోగుల కోసం ఉద్యోగం నోటిఫికేషన్లు, స్వయం ఉపాధి పథకాలు ప్రవేశపెట్టడం హర్షనీయమని అన్నారు. రాజీవ్ వికాసం పథకం ద్వారా నిరు ద్యోగులకు సబ్సిడీ రుణాలను ఆయా యూనిట్లకు తగ్గట్టుగా మూడు లక్షల రూపాయలు అందిస్తున్నా



రని, ఈ పథకం ద్వారా వెనుకబడిన వర్గాల యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనిస్తుందని అన్నారు. యువత భవిష్యత్తు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు.

## విజయలక్ష్మి సూపర్ మార్కెట్ ప్రారంభించిన రామకృష్ణారెడ్డి

**మోత్కూరు, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
ప్రజలకు నాణ్యమైన వస్తువులు అందించి ప్రజల మన్ననలు పొందినప్పుడే సూపర్ మార్కెట్‌కు మంచి గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర మాజీ ఆయిల్ పేడ్ చైర్మన్, బి.ఆర్.ఎస్. జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. గురు



వారం నాడు మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఎస్.బి.ఐ. సమీపంలో మెయిన్ రోడ్డు వద్ద విజయలక్ష్మి సూపర్ మార్కెట్ "ను ఆయన ప్రారంభించారు ఈ కార్యక్రమంలో. సూపర్ మార్కెట్ ప్రొపైటర్ దబ్బేటి విజయలక్ష్మి రమేష్ మాజీ మున్సిపల్ చైర్మన్ గుర్రం కవిత లక్ష్మి నర్సింహ్మారెడ్డి వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్ బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగ శీను తదితరులు పాల్గొన్నారు.








# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మరియు ఇండ్ల స్థలాలు
# కొత్త రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి

### రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తిప్పర్తి మాజీ జెడ్పిటిసి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మరియు ఇండ్ల స్థలాలు కొత్త రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయాలని లిసిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తిప్పర్తి మాజీ జెడ్పిటిసి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం తిప్పర్తి ఎమ్మార్వో ఆఫీస్ ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామంలలో స్థానిక సమస్యలపై గత పది రోజులుగా సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా సర్వే సందర్భంగా వచ్చిన సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించడం జరుగుతుందని అన్నారు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మండల కేంద్రానికి లింక్ రోడ్లను ఏర్పాటు చేయాలని. మండలంలోని రోడ్ల వెడల్పు సందర్భంగా ఇల్లు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారికి ఇల్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని మరియు ఉపాధి హామీ పనులలో పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే ఇవ్వాలని ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి 600 రూపాయల కూలి అమలు చేయాలని డిమాండ్ చేశారు అదే విధంగా రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయాలని అన్నారు మండలంలో ఉన్నటువంటి రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని వెంటనే వాటిని మరమ్మతు చేయాలని గ్రామాల్లో కొన్నిచోట్ల మురికి కాలువ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెంటనే అవసరం ఉన్న చోట మురికి కాలువలను ఏర్పాటు చేసి సిసి రోడ్లను వేయాలని డిమాండ్ చేశారు రైతు రుణ మాఫీ పూర్తి స్థాయిలో చేయాలని కాలువల ద్వారా సాగు భూమికి నీరు అందించాలని అన్నారు లేని పక్షంలో పెద్ద ఎత్తున సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నన్నూరు వెంకటరమణారెడ్డి మండల కార్యదర్శి మన్నె బిక్షం నాయకులు భీమగాని గణేష్ గండమళ్ళ రాములు చనగోని వెంకన్న అకిటి లింగయ్య పోకల శశిధర్ మాలి భార్గవి శరత్ గండమళ్ళ యాదగిరి సంజీవరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మైల సైదులు కోట్ల గోవర్ధన్ రెడ్డి నలపరాజు యాదయ్య యాదగిరిరెడ్డి సింహాద్రి రోట్టెల జానయ్య గంటేకంపు చంద్రకళ ఝాన్సీ విజయలక్ష్మి బ్రహ్మాచారి శంకరాచారి శ్రీను శంకర్ మల్లమ్మ జానమ్మ సైదులు అంజమ్మ యాదమ్మ సుజాత పద్మ సరిత అండాలు ప్రియాంక సునిత మంగమ్మ,అనుష, అరుణ సైదులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్ రహిత తెలంగాణనే ప్రభుత్వ లక్ష్యం

### ఆ దిశగా సర్కారు ఆలోచన చేయడం శుభపరిణామం

### తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి , పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరికీ ఉందని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపార. ప్లాస్టిక్ వాడకం వలన పరిసరాలు అపరిశుభ్రంగా మారి కలుషితం అవుతున్నాయని ఆయన చెప్పారు . ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా తెలంగాణ ప్రభుత్వం జూట్ బ్యాగుల వాడకంపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఇది శుభపరిణామమని ఆయన తెలిపారు. నేడు తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, సీఎస్ శాంతి కుమారి తెలంగాణ శాసన మండలిలో గుత్తా సుఖేందర్ రెడ్డిని కలిసి జ్యూట్ బ్యాట్ ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ వాక్యాలు చేశారు.

## ఆత్మహత్య ప్రయత్నం నుంచి ప్రాణాలు కాపాడిన నల్లగొండ పోలీసులు

**నల్లగొండ జిల్లా బ్యూరో, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** నల్గొండ టూ టౌన్ పరిధిలో రాత్రి సమయమున ఒక వివాహిత కుటుంబ సమస్యల వలన మనస్పర్ధ చెంది రైలు పట్టాల మీద చనిపోవడానికి ఆత్మహత్య ప్రయత్నంకు




సిద్ధమైంది. ఇది గమనించిన స్థానికులు టూ టౌన్ ఎర్ర సైదులు కు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి 100 కాల్ సిబ్బంది కానిస్టేబుళ్లు నాగరాజు, సతీష్ ను అక్కడికి పంపించినారు. సిబ్బంది వెంటనే అక్కడ చేరుకొని అప్రమత్తమై చాకచక్యంగా ఆమెను కాపాడి , పోలీస్ స్టేషన్ తీసుకొని రాగా ఆమెను సఖి సెంటర్లో ఉంచి మరుసటి రోజు ఉదయం టూ టౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు ఆమెకు మరియు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేసి ఆమెను, కుటుంబ సభ్యులకు అప్పగించినారు...

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** చింతపల్లి మండలం లోని తీదేడు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు దాసరి ముత్తయ్య - కళమ్మ గార్ల కుమారుడు జంగయ్య కవిత గార్ల వివాహ వేడుకలో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను



ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి,తీదేడు గ్రామ శాఖ అధ్యక్షులు సోనగంటి గోవర్ధనాచారి,పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి, మర్రు రామారావు,ఉలుపాల పురుషోత్తం రెడ్డి,సిమర్ల కృష్ణ యాదవ్,మర్రు రామారావు,కాయితి బచ్చిరెడ్డి,రమావత్ కొండల్ నాయక్,సిమర్ల రాములు,,రమావత్ మాంత్య నాయక్, వీరమల్ల వెంకటయ్య,ఉడుత శంకర్,సివర్ల ఆంజనేయులు,సిమర్ల అనిల్, మాదగోని మోహన్ గౌడ్,ఉడుత వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు అడ్వకేట్స్ ఎన్నికల్లో జాయింట్ సెక్రటరీగా బోడిగె అంజయ్య గౌడ్ విజయం

**చిట్యాల రూరల్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన బోడిగె అంజయ్య గౌడ్ హయత్నగర్ కోర్టు అడ్వకేట్స్ ఎన్నికల్లో జాయింట్ సెక్రటరీగా విజయం సాధించడం పట్ల గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అన్ని రాజకీయ పార్టీ నాయకులు యువజన సంఘాలు అంజయ్య గారికి శుభాకాంక్షలు తెలపడం జరిగింది.



# స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్

**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** ధాన్యం కొనుగోలు, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్, పెట్రోల్ బంకుల నిర్వహణ తదితర కార్యక్రమాల వల్ల స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు.

గురువారం ఆయన హైదరాబాద్ నుండి సెర్ఫ్ సీఈఓ దివ్య తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఆర్డిఓ,సెర్ఫ్ అధికారులతో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఐకెపి ద్వారా రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరింత పెంచాలని, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా ఐకెపి మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన పెండింగ్ లో ఉన్న కమిషన్ ను సమీక్షించాలని, కమిషన్ మొత్తాన్ని 10% జిల్లా సమాఖ్యలు, 90% గ్రామ సమస్యలకు వెళ్లే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, గన్ని బ్యాగుల సమీకరణ చేయాలని , భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో మహిళ సంఘాల ద్వారా గోడౌన్లతో పాటు, రైస్ మిల్లుల ఏర్పాటు వంటివి ఆలోచిస్తున్నందున ధాన్యం కొనుగోలులో స్వయం సహాయక మహిళా సంఘాలు చురుకుగా పాల్గొనేలా చూడాలన్నారు.

యుడిఐడి నంబర్లు, సదరం క్యాంపుల నిర్వహణకు సంబంధించి స్లాట్ పెండింగ్లో ఉన్న జిల్లాలు తక్షణమే స్లాట్ ఇవ్వాలని,. సదరం క్యాంపుల నిర్వహణకు ఆసుపత్రులలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించాలని, సదరం



క్యాంపులు డేటా ను ఎప్పటికప్పుడు పూర్తి చేసేందుకు మంచి డేటా ఎంట్రీ ఆపరేటర్ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సదరం క్యాంపులలో మౌలిక సదుపాయాలతో పాటు, పౌర సదుపాయాలను పెంచాలన్నారు.వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించి చనిపోయిన వారి పేర్లను జాబితాలో తీసివేయడం భాగస్వామికి అర్హత ఉన్నట్లయితే పెన్షన్ మంజూరి చేయడం, ఒక కుటుంబంలో ఒకరికే వృద్ధాప్య పింఛన్ ఉండేలా చూడడం, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు తొలగించడం వంటివి ఎంపీడీవోల ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. చనిపోయిన కేసుల విషయంలో పూర్తిగా పరిశీలన చేసిన తర్వాతే నిర్ధారణకు రావాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలు ద్వారా పాఠశాల విద్యార్థుల యూనిఫామ్స్తో పాటు,వారి ఆదాయ మార్గాలు పెంచుకునే విధంగా ప్రైవేట్ ఆర్డర్లపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యేకించి యూనిఫామ్స్ కుట్టడానికి రాష్ట్ర స్థాయిలో ఆరుగురు మాస్టర్ ట్రైనర్లను గుర్తించడం జరిగిందని వీరు మండల స్థాయిలో ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇస్తారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా ప్రతి జిల్లా , నియోజక వర్గ, మండల కేంద్రాలలో పెట్రోల్ బంక్ లను నిర్వహించాలని ఆలోచిస్తున్నందున జిల్లా స్థాయిలో పెట్రోల్ బంక్ ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించినట్టే, మండల, నియోజకవర్గాల స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఈ పెట్రోల్ బంకుల వద్ద రెస్టారెంట్ ,మాల్స్ నిర్వహించాలని, భవిష్యత్తులో ఇందిరా మహిళా శక్తి బజార్ వంటి వాటిని నిర్వహించేందుకు ఆస్కారం ఉందన్నారు . సాధారణ జీవిత బీమా, ప్రమాద బీమా ల పై ఆయన సమీక్షించారు. సర్ఫ్ సీఈవో దివ్య వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి ,తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

# గొప్ప జాతీయ నాయకున్ని కోల్పోయిన బిజెపి పార్టీ

### నమ్ముకున్న సిద్ధాంతాల కోసం తన ప్రాణాల సైతం ఫణంగా పెట్టిన నాయకుడు స్వర్గీయ గుండగోని మైసయ్య గౌడ్ : ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** కీ. గుండగోని మైసయ్య గౌడ్ 27వ వర్ధంతి సందర్భంగా నల్గొండ పట్టణంలోని వారి విగ్రహానికి మైసయ్య గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఉమ్మడి కరీంనగర్ -నిజామాబాద్ -ఆదిలాబాద్ -మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమెయిల్ అంజి రెడ్డి , బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు నీ వాళ్ళ అర్పించారు.

ఈ సందర్భంగా బిజెపి నల్గొండ జిల్లా అధ్యక్షులు డా. నాగం వర్షిత్ రెడ్డి ఏర్పాటు సంస్మరణ సభలో ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లా ఒక గొప్ప జాతీయ నాయకుడిని కోల్పోయిందని, నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజాసేవలో అహర్నిశలు శ్రమించిన మహానేత గుండగోని మైసయ్య గౌడ్ . బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ఆయన, పేద ప్రజలకు పెన్నిధిగా నిలిచారు.మైసయ్య గౌడ్ ఆశయం కోసం ప్రతి కార్యకర్త నల్గొండ జిల్లాలో కాషాయజెండా గెలిపించడం కోసం పని చేయాలనీ కోరారు.

ఈ సందర్భంగా డా. కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ

మైసయ్య గౌడ్ తన రాజకీయ జీవితంలో అనేక అడ్డంకులను అధిగమించి, నిస్వార్థ సేవను తన లక్ష్యంగా చేసుకున్నారు. దేశద్రోహుల కుట్రలకు ఎదురొడ్డి,ఎన్నో దాడులను తట్టుకుని, చివరకు నక్సలైట్ల దుర్మార్గపు చేతుల్లో చండూర్ మండలం తెరట్ పల్లి గ్రామంలో ప్రాణాలు కోల్పోయారు. కానీ ఆయన చూపిన మార్గం, ఆయన కలలు మనందరికీ మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు గుండగోని భరత్ గౌడ్ ,బిజెపి రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్ ,సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చల్ల శ్రీలత రెడ్డి , జాతీయ కిసాన్ మోర్చ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి ,బిజెపి రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్ ,శ్రీ గుండగోని గిరిబాబు దోనూరు వీరా రెడ్డి సాధినేని శ్రీనివాస్ గారు, బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీ బండారు ప్రసాద్ గారు, పట్టణ కౌన్సిలర్స్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థి దశ నుండి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలి

### - జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి, మార్చి 27 (వార్త వేదిక సూర్య):** విద్యార్థి దశనుండే. ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థులకు బోధించారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని శ్రీ రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్ లో ఏర్పాటుచేసిన నిడమనూరు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు .

ముందుగా జిల్లా కలెక్టర్ తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థుల తెలివితేటలను పరీక్షించారు. గణితం, సైన్స్, సోషల్ ,హిందీ ,ఇంగ్లీష్ సబ్జెక్టులపై వివిధ రకాల ప్రశ్నలను అడిగారు .సరైన సమాధానాలు చెప్పిన పిల్లలకు చాక్లెట్లను పంపిణీ చేశారు.

ఆయా తరగతి గదులలో విద్యార్థినిలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎండాకాలంలో విద్యార్థులు అనారోగ్యం పాలు కాకుండా సులభంగా జీర్ణం అయ్యే ఆహారాన్ని తీసుకోవాలని, ఎట్టి పరిస్థితులలో జంక్ ఫుడ్ తినవద్దని చెప్పారు.పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ తక్కిన పరీక్షలను బాగా రాయాలని చెబుతూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం పాఠశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుండే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ లక్ష్య సాధనకు కృషి చేయాలని బోధించారు.



www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY






## ఒడిబియ్యం అన్నదాన ప్రసాద వితరణ

**చౌటుప్పల్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం కళ్యాణ మహోత్సవం మరియు బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం గురువారం నిర్వహించారు అనంతరం బ్రహ్మోత్సవాలకు సహకరించిన దాతలకు సత్కారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు నాగిళ్ళ రామచంద్రం ప్రధాన కార్యదర్శి ఉదరి శంకర్ గౌరవ అధ్యక్షుడు గుజ్జులా సురేందర్ రెడ్డి గౌరవ సలహాదారులు బత్తుల శ్రీశైలం గౌడ్ బడుగు మాణిక్యం కమిటీ సభ్యులు చింతల ప్రభాకర్ రెడ్డి ఉప్మగుల శ్రీను ఉదరి శ్యామ్ ఎలుకరాజు మల్లేష్ (నాగరాజు) కానుగు శేఖర్ తూర్పునూరి మల్లేష్ గౌడ్ తూర్పునూరి నరసింహ గౌడ్ ఆరుట్ల లింగస్వామి నకరకంటి శ్రీశైలం చెవగొని మహేష్ గౌడ్ ఉయ్యాల పల్లవి బడుగు పద్మ ఉదారి యాదయ్య నల్ల గణేష్ యాదవ్ మరియు అన్నదానం పోషకులు ప్రియాంక హాస్పటల్ శ్వేత ప్రియాంక సుధీర్ ఆలయం అర్చకులు పగిడోజు సంతోష్ కుమార్ గారు బాల్యం వెంకటచలపతి గారు నాంపల్లి శ్రీను ఉదారి మరియ్య చెవగొని రమేష్ గౌడ్ గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రవి గౌడ్

**ఎల్బీనగర్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
టెక్కీ రైడ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ విజయవాడ ప్రధాన రహదారి లో ప్రయాణికులకు పాదచారులకు నగరవాసులకు వేసవి తాపం నుండి కొంత ఉపశమనాన్ని దాహార్తిని తీర్చే ఉద్దేశంతో ఈ చలివేంద్రం ఏర్పాటు బృహత్తర




కార్యాన్ని నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రవి గౌడ్ విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు కొబ్బరికాయ కొట్టి చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆయన ప్రయాణికులకు నీటిని మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తున్న టెక్కీ రైడ్ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెక్కీ రైట్ వ్యవస్థాపకులు రాఘవేందర్, వారి బృందం పాల్గొనడం జరిగింది అదేవిధంగా ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులు గా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పర్యావరణ మిత్ర, సేవారత్న, డాక్టర్ టి సురేందర్ తదితరులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా టెక్కీ రైడ్ సేవలను కొనియాడుతూ వారికి అభినందనలు తెలియజేసారు.

## మొక్కజొన్న కేంద్రాలను ఏర్పాటు చేయాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**హైదరాబాద్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను గురువారం వారి కార్యాలయం లో జగిత్యాల నియోజకవర్గ పరిధిలో దాదాపు



6వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలను పండించారని మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మొక్కజొన్న పండించిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.

## గణం బీరు మల్లయ్య - నరసమ్మల జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

**చౌటుప్పల్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
సమస్త నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గణం బీరు మల్లయ్య కురుమ 19 వ వర్ధంతి మరియు వారి సతీమణి గణం నరసమ్మ 21వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడైన గణం నర్సింహ్మా లక్ష్మీ దంపతులు వారి కుమారులు గణం గిరిప్రసాద్ కురుమ.గణం హరిప్రసాద్ కురుమ. లు గురువారం కుర్మగూడెం లోని ప్రాథమిక పాఠశాల మరియు అంగన్ వాడి విద్యార్థులకు నోటు పుస్తకాలు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గణం నర్సింహ్మా కురుమ మాట్లాడుతూ గణం బీరు మల్లయ్య కురుమ కుర్మగూడెం కురుమ కుల సంఘం పెద్ద కురుమగా సుమారు 30 సంవత్సరాలుగా పనిచేయడం జరిగిందని అలాగే 1990 నుండి 3 పర్యాయాలు గొర్రెల పెంపక దారుల సహకార సంఘం చైర్మన్‌గా పని చేయడం జరిగిందని తమ కులస్తులకే కాకుండా గ్రామస్తులు అందరికీ కూడా అనేక సేవలు అందించినటు వంటి వ్యక్తి మా నాన్న గణం బీరు మల్లయ్య అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మా నాన్న గణం బీరు మల్లయ్య మా అమ్మ గణం నరసమ్మగార్ల వర్ధంతి సందర్భంగా నేను చదువుకున్నటువంటి పాఠశాలలో విద్యార్థులకు మొదటి సంవత్సర వర్ధంతి సందర్భంగా ప్లేట్లు పంపిణీ చేయడం జరిగిందని ఈ సంవత్సరము విద్యార్థులకు



నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని రాబోయే కాలంలో మా తల్లిదండ్రుల పేరు మీద అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని పేదలకు సహాయ సహకారాలు చేస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంశీకృష్ణ ఉపాధ్యాయురాలు జ్యోతి అంగన్వాడి పాఠశాల ఆయా రామలక్ష్మమ్మ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







## ఇంకుడు గుంతలు నిర్మించు.. వర్షపు నీటిని ఒడిసి పట్టు

### - డి.బలరామరాజు, జిఎం జలమండలి

**హైదరాబాద్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల పై అవగాహన కార్యక్రమాన్ని డివిజన్ 10 పరిధిలోని దిల్సుఖ్నగర్ సెక్షన్ పిఎన్టి కాలనీలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జలమండలి జిఎం డి బలరామరాజు డిజిఎం సన్యాసిరావు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ టి సురేందర్ మేనేజర్ రజిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం బలరామరాజు ఇంకుడు గుంతను నిర్మించుకున్న కె ఎస్ రఘునాథం అండ్ బ్రదర్స్ కు అభినందనలు తెలియజేశారు అదేవిధంగా ఇంకుడు గుంతల ఆవశ్యకత గురించి వివరించినారు నీటి వృధాను అరికట్టాలని తెలియజేస్తూ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పిఎన్టి కాలనీ కోదండ రామనగర్ కాలనీవాసులతో ర్యాలీ నిర్వహించారు. ఇంకుడు గుంత నిర్మాణం దాని నిర్వహణ పద్ధతుల గురించి కాలనీవాసులకు వివరించడం జరిగింది. ఈ సందర్భంగా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ టి సురేందర్ మాట్లాడుతూ సాధారణంగా వేసవిలో వచ్చే ఎద్దడిని అధిగమించాలంటే నీటి వృధా ని అరికట్టి నీటిని పొదుపుగా వాడుకోవాలి అన్నారు అదేవిధంగా ఎండాకాలంలో బోర్ వెల్స్ పనిచేయాలంటే వర్షాకాలంలో వచ్చే వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా ఒడిసి పట్టుకోవాలి అని తెలియజేశారు భూగర్భ జలాలు, భూ ఉపరితల జలాలు సమృద్ధిగా ఉంటే నీటి కొరత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, వెంకటేశ్వరరావు, హేమ, శ్రీధర్, రఘు, శేఖర్, రేణు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధికూలీలకు తగిన వసతులు కల్పించాలి

**తొర్రూర్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
తొర్రూరుమండలం పరిధిలో చీకటాయపాలెం..గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఉడుగుల లింగన్న



పరిశీలించారు ఈ సందర్భంగా ఊడుగుల లింగన్న మాట్లా డుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఉపాధి హామీ పని కల్పించాలి..కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ నిధులను తగ్గిస్తూ పథకాన్ని రద్దు చేసే కుట్ర చేస్తుందన్నారు కూలీలకు కనీస వేతనం కింద 600 రూపాయలు పని ప్రదేశంలో తాగునీరు మెడికల్ కిట్ నీడ వసతి ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రతి గ్రూపుకు ఒక మేట్‌ని ఏర్పాటు చేయాలని జాబ్ కార్డు లేని ప్రతి ఒక్కరికి తక్షణమే కార్డులు మంజూరు చేయాలని కనీస ఉపాధి హామీ రోజులను వంద నుండి 200 రోజులకి పెంచాలని డిమాండ్ చేశారు వేసవిలో ఎండలను దృష్టిలో పెట్టుకొని కొలతలతో సంబంధం లేకుండా కనీసం 600 రూపాయలు చెల్లించాలని ప్రమాదవశాత్తు కూలీలకు ప్రమాదం సంభవిస్తే వారికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు పని ప్రదేశంలో మరణిస్తే మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని వారం వారం క్రమం తప్పకుండా మాస్టర్ స్లిప్ లు అందించాలని రెండు వారాలకు ఒకసారి డబ్బులు పడేవిధంగా చూడాలన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధి వాసు తండా అశోకు అబ్బాస్ తండా లింగయ్య అంజయ్య సప్న మమత పద్మ రమ కోమలత మనోహర్ తదితరులు పాల్గొన్నారు.




## సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం

### - రవి గౌడ్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్

**ఎల్బీనగర్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
జలమండలి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జల సంరక్షణపై అవగాహన నిమిత్తం బ్యానర్, వాల్ పోస్టర్స్ ప్రదర్శన కార్యక్రమం ఎల్బీనగర్ లో జరిగింది. టెక్కిరైడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రవి గౌడ్ టెక్కిరైడ్ విజయవాడ రహదారిలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా ఆయన జలసంరక్షణపై జలమండలి రూపొందించిన గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం జల సంరక్షణ కోసం కృషి చేస్తూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేస్తున్న వారు అభినందనీయులు అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్కిరైడ్ వ్యవస్థాపకులు రాఘవేందర్ (రఘు) మరియు సహచర బృందం ప్రతినిధులు ఆర్టీసీ, ట్రాఫిక్ సిబ్బంది పాదచారులు వాహన దారులు పాల్గొన్నారు. టెక్కిరైడ్ ఫౌండర్ రాఘవేంద్ర(రఘు) మరియు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ టి సురేందర్ ముఖ్య



అతిథులకు శాలువా కప్పి ఔషద మొక్కలను అందజేయడం జరిగింది. వేసవి తాపం నుండి నగరవాసులు ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్న టెక్కిరైడ్ వారికి అభినందనలు ప్రశంసలను తెలియజేశారు.



## ఘనంగా మెలుహా ఇంటర్నేషనల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే

**మొయినాబాద్,మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని గల మేలుహా ఇంటర్నేషనల్ స్కూల్ హైదరాబాద్‌లో ఉన్న ప్రముఖ స్కూళ్లలో మరోసారి ప్రధాన శీర్షికల్లో నిలిచింది. కామర్స్ మరియు ఐబి సహా వివిధ విభాగాల ఇంటర్మీడియట్ విద్యార్థుల గ్రాజుయేషన్ వేడుకను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలతో విశేషంగా అలరించింది. వారి ప్రతిభను, విజయాలను ప్రదర్శిస్తూ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు.ప్రిన్సిపాల్ నాగేంద్ర మాట్లాడుతూ మెలుహా ఇంటర్నేషనల్ స్కూల్ నూతన మరియు ప్రగతిశీల విద్యను 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యను అందిస్తూ, ఒక ప్రఖ్యాత విద్యాసంస్థగా ఎదుగుతోందని అన్నారు. అత్యుత్తమ విద్యను అందించడానికి కట్టుబడి ఉన్న ఈ సంస్థ, సమగ్రమైన మరియు భవిష్యత్‌కు సిద్ధమైన విద్యా విధానాన్ని అందిస్తూ తన ప్రత్యేకతను నిరూపించుకుందని అన్నారు. విద్యార్థులు చేసిన ప్రదర్శినలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## వెలిమినేడు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన

**చిట్యాల రూరల్, మార్చి 27 (వార్త వేదిక సూర్య):**
వెలిమినేడు గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనుల శంఖుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి ఈ కార్యక్రమంలో చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మి నరసింహ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటం వెంకటేశం. సింగిల్ విండో వైస్ చైర్మన్ బొంతల



అంజిరెడ్డి.వెలిమినేడు గ్రామశాఖ అధ్యక్షులు సుర్కంటి సత్తిరెడ్డి. కొంపెల్లి వెంకట్ రెడ్డి,అంతటి నర్సింహ్మా,పిశాటి భీష్మా రెడ్డి,ఏదుళ్ల అజిత్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ తాటికొండ లింగస్వామి,కాటం సత్తయ్య,చిర్రగోని శ్రీశైలం,ఏనుగు సుధాకర్ రెడ్డి,అంతటి రాజు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి,నాతి స్వామి,పబ్బు గిరి ప్రసాద్,నాతి బిక్షమయ్య, అంశాల శ్రవణ్,గోలి మహేష్,,గోలి పుల్లయ్య, గోలి నరేష్, బైకాని స్వామి మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



## ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు బైలింగ్వల్ లాంచ్

ప్రదీప్ రంగనాథన్ తను దర్శకత్వం వహించిన బ్లాక్ బస్టర్ 'లవ్ టుడే'తో నటుడిగా అరంగేట్రం చేసాడు, ఆ తర్వాత తమిళం, తెలుగు రెండింటిలోనూ విజయం సాధించిన తన రీసెంట్ హిట్ 'డ్రాగన్' తో మ్యాసీవ్ పాపులరిటీ సాదించారు. వరుస విజయాలతో, ప్రదీప్ రంగనాథన్ తమిళ సినిమాల్లోనే కాకుండా తెలుగులో కూడా పేరు తెచ్చుకున్నాడు. పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా తమిళం-తెలుగు ద్విభాషా ప్రాజెక్టును అనౌన్స్ చేసింది. గతంలో అనేక సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులకు అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసిన కీర్తిశ్వరన్ ఈ చిత్రం డైరెక్టర్ పరిచయం కానున్నారు. చ%లా=%04 చిత్రం ఈరోజు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు వేడుకలోని ఫస్ట్ విజువల్స్ ప్రదీప్ రంగనాథన్ నటించిన ఆసక్తికరమైన సన్నివేశాన్ని రివిల్ చేశాయి, ఇది ఒక ఇంటెన్స్ లో ప్రారంభమై, ఒక ఫన్ ఫుల్ కిస్ తో ముగుస్తుంది, ఇది న్యూ ఏజ్ కథాంశంతో కంప్లీట్ ఎంటర్టైనర్ గా ఉండబోతోంది. 'ప్రేమలు' చిత్రంతో అందరినీ అలరించిన మమిత బైజు హీరోయిన్ గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్ కోసం ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ ని ఎంపిక చేసింది.

ఈ చిత్రానికి సంగీతం యంగ్ సెన్సేషన్ సాయి అభ్యాంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్గా, భరత్ విక్రమన్ ఎడిటర్గా పని చేస్తున్నారు.



## పెద్దిగా రామ్‌చరణ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన 16వ చిత్రంతో వెండితెరపై తుపాను సృష్టించటానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత, ఉప్పెన ఫేమ్..దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందిస్తోన్న చిత్రంతో ప్రేక్షకులను అలరించటానికి సిద్ధమవుతున్నారు. భారీ బడ్జెట్తో ఈ పాన్-ఇండియా సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తోంది, సుకుమార్ రైటింగ్స్ సృజనాత్మక శక్తి కూడా తోడవుతుంది. ఈ హ్యూజ్ బడ్జెట్ మూవీని వృద్ధి సినిమాస్ బ్యానర్పై వెంకట సతీష్ కిలారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజమైనత తుపాను రాక మునుపే మేకర్స్ దాని రాకను తెలియజేసేలా ప్రీ లుక్ను విడుదల చేసి సినిమాపై అందరిలో ఆసక్తిని మరింతగా పెంచారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను తెలియజేస్తూ మేకర్స్ సినిమా టైటిల్ను 'పెద్ది' అని అనౌన్స్ చేశారు. ఈ టైటిల్ రామ్ చరణ్ పాత్రలోని శక్తి, గాంభీర్యాన్ని సంపూర్ణంగా, గొప్పగా తెలియచేస్తోంది. 'పెద్ది' సినిమా కోసం రామ్ చరణ్ అందరూ ఆశ్చర్యపోయి చూసేలా తన లుక్ను రగ్గ్గా మార్చుకోవటం విశేషం. ఈ రా క్యారెక్టర్లో నటించటానికి ఆయన స్టార్ ఇమేజ్ను పక్కకు పెట్టి ఇంటెన్స్, రియల్గా కనిపించే ప్రయత్నం చేశారు. ఇది వరకు రామ్ చరణ్ కనిపించనటువంటి సరికొత్త లుక్ ఇది. పదునైన చూపులు, గజిబిజి జుట్లు, గుబురు గడ్డం, ముక్కుకి రింగు, మాసిన బట్టలు, సిగరెట్ తాగుతూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించే అవతార్లో కనిపిస్తున్నారు చరణ్. మరో పోస్టర్ను గమనిస్తే పాత క్రికెట్ బ్యాట్ను పట్టుకుని ఫ్లడ్ లైట్ వెలుతురులో ఓ గ్రామంలోని స్టేడియంలో నిలుచుని ఉన్నాడు. ఈ రెండు పోస్టర్స్ సినిమాలో హీరో పాత్ర నేపథ్యాన్ని, కథ, కథనం.. గ్రామీణ వాతావరణంలోని తీవ్రత, నాటకీయత సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. డైరెక్టర్ బుచ్చిబాబు సానా రామ్ చరణ్ పాత్రను ఎంతో జాగ్రత్తగా రూపొందించినట్లు పోస్టర్స్లో స్పష్టంగా కనిపిస్తోంది. తను చెప్పాలనుకున్న విషయాలను పోస్టర్స్ రూపంలో చూపెట్టారు. హీరో రా క్యారెక్టర్ తన పాత్రలోని ఇతర భావాలను చెప్పేలా పోస్టర్స్ను డిజైన్ చేశారు. రామ్ చరణ్ తన పాత్రకు ప్రామాణికతను తీసుకురావడానికి.. బుచ్చిబాబు ఏదో కొత్తదనాన్ని సృష్టించేందుకు.. తమ నిబద్ధతను చూపిస్తున్నారు.





## ఫిల్మ్ అండ్ టీవీ డైరెక్టరీ డిజిటల్ మీడియా అవార్డ్స్

డిజిటల్ మీడియా రంగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన వారిని సత్కరించేందుకు నిర్వహించిన వి.బి. ఎంటర్టైన్మెంట్స్ డిజిటల్ మీడియా అవార్డ్స్-2025' వేడుక. ఈ వేడుకలో డిజిటల్ మీడియా రంగంలో వివిధ విభాగాల్లో విజేతలు అవార్డులు అందుకున్నారు. వి.వి.కె సంస్థ సమర్పణలో వీబి ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 'వి.బి.ఎంటర్టైన్మెంట్స్' అధినేత ఇంకా 'ఈసీ మెంబర్ ఆఫ్ మా' అయిన విష్ణు బొప్పన ఫౌండర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విజేతలు అవార్డులు అందుకుని, తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. విజేతలకు సీనియర్ ప్రొడ్యూసర్ అంబికా కృష్ణ చేతుల మీదుగా అవార్డ్స్ అందాయి. ఈ నేపథ్యంలో అంబికా కృష్ణ మాట్లాడుతూ.. విజేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రింట్ మీడియా కంటే డిజిటల్ మీడియా ఇంకా బాగా అభివృద్ధి చెందింది అన్నారు. డిజిటల్ మీడియా ప్రజలకు ఇంకా ఎన్నో మంచి వార్తలు ఇవ్వాలని కోరుకుంటున్నా అన్నారు. అలాగే విష్ణు గురించి కూడా ఈ సందర్భంగా మాట్లాడారు. ఆయన చేసిన మంచి పనులని తెలియజేశారు. గత 10 సంవత్సరాల నుంచి చిన్న పిల్లలకు విష్ణు ఎన్నో విధాలుగా సాయపడ్డారని గుర్తు చేశారు. అనాథ పిల్లలకు అండగా నిలిచారని అన్నారు.

## ఇలాంటి సినిమాలు ఆరోగ్యానికి చాలా మంచిది

### - 'మ్యాడ్ స్క్వేర్'

బ్లాక్బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్ గా రూపొందిన 'మ్యాడ్ స్క్వేర్'పై భారీ అంచనాలు ఉన్నాయి. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ తో కలిసి సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. భీమ్స్ సిసిరోలియో పాటలను స్వరపరచగా,



తమన్ నేపథ్య సంగీతం అందించారు. ఈ వేసవికి వినోదాల విందుని అందించడానికి 'మ్యాడ్ స్క్వేర్' చిత్రం మార్చి 28న థియేటర్లలో అడుగుపెడుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు విశేషంగా ఆకట్టుకొని.. ఈ సినిమా సంచలన విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని కలిగించాయి. బుధవారం సాయంత్రం ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్ లో వైభవంగా నిర్వహించారు. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుకలో ప్రముఖ దర్శకులు మారుతి, వెంకీ అట్లూరితో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అక్కినేని నాగచైతన్య మాట్లాడుతూ, "మ్యాడ్ స్క్వేర్ ట్రైలర్ చూశాను. అది మ్యాడ్ స్క్వేర్ కాదు, మ్యాడ్ మ్యాక్స్. ట్రైలర్ చాలా బాగుంది. నాకు ఈ వేడుకకు రావడం సంతోషంగా ఉంది. నేను మ్యాడ్ సినిమాలోని కామెడీ సీన్స్ చూస్తూ, ఒత్తిడిని దూరం చేసుకుంటూ ఉంటాను. ఇలాంటి సినిమాలు ఆరోగ్యానికి చాలా మంచిది. డల్ గా ఉన్నప్పుడు మ్యాడ్ లాంటి సినిమా చూడమని డాక్టర్లు కూడా సూచించాలనేది నా అభిప్రాయం. ఇలాంటి సినిమాలు చూడటం వల్ల.. ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి సరదాగా గడిపేలా చేస్తాయి. ఫ్రెండ్ షిప్ ని స్ట్రాంగ్ చేస్తాయి. కొత్త ఫ్రెండ్స్ ని పరిచయం చేస్తాయి. మ్యాడ్ లాంటి సినిమాలు రావడం సంతోషంగా ఉంది. మ్యాడ్ సినిమాతో ఈ ముగ్గురు హీరోలు స్టార్స్ అయిపోయారు. ప్రతి ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిలా వీళ్ళ పేర్లను గుర్తు పెట్టుకుంటారు. కామెడీ చేయడం అనేది చాలా కష్టం. నార్నె నితిన్, రామ్, సంగీత్ లో ఆ టాలెంట్ ఉంది కాబట్టే ఇంత నవ్వించగలిగారు. ఒక స్టోరీ డిస్కషన్ లో దర్శకుడు కళ్యాణ్ తో కూర్చున్నప్పుడు ఆయన నేరేషన్ కే పడిపడి నవ్వాను. ఇక ఈ సినిమా ఎలా ఉంటుందో ఊహించగలను.

నా ఫేవరెట్ డీఓపీ శామ్‌దత్ గారు ఈ సినిమాకి పనిచేశారు. నిర్మాతగా హారిక మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను. నాది, నాగవంశీ జర్నీ ప్రేమమ్ తో మొదలైంది. తన ధైర్యమే నాగవంశీని ఇంతదూరం తీసుకొచ్చింది. దర్శకులకు, నటులకు ఎంతో ధైర్యాన్ని ఇస్తూ వరుస విజయాలు అందుకుంటున్నారు. అలాగే నిర్మాత చినబాబు గారు అంటే నాకు ఎంతో ఇష్టం. మ్యాడ్ స్క్వేర్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.

మంచి ఓపెనింగ్స్ వచ్చి, సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. మ్యాడ్ 2 మాత్రమే కాదు, మ్యాడ్ 100 కూడా రావాలని కోరుకుంటున్నాను. టీం అందరికీ ఆల్ ది బెస్ట్" అన్నారు.



## 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' కూల్ & బ్రీజీ ఫస్ట్ లుక్

మత్తువదలరా, సూపర్ హిట్ సిరీస్ వికటకవిలో తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న హీరో నరేష్ అగస్త్య తన నెక్స్ట్ ప్రాజెక్ట్ సైన్ చేశారు- విపిన్ దర్శకత్వంలో సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్పై ఉమా దేవి కోట నిర్మించిన ఈ మూవీ కంటెంట్-రిచ్ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా. కూల్, బ్రీజీ ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఈ సినిమా టైటిల్ను రివిల్ చేశారు. ఈ సినిమాకు 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' అనే ప్లజెంట్ టైటిల్ పెట్టారు. ఫస్ట్ లుక్ పోస్టర్లో నరేష్ అగస్త్య చీర్ ఫుల్ అవతార్లో ఆకట్టుకున్నారు. రబియా ఖటూన్ ఛార్మింగ్ గా కనిపించింది. వారి మధ్య పొగమంచు కొండ ప్రాంతం, ప్రశాంతమైన నేపథ్యం మధ్య ఉంచబడిన గిటార్ మూవీ మ్యూజిక్ బ్యాక్ డ్రాప్ ని సూచిస్తుంది. ఇది లవ్, డ్రీమ్స్, బ్యూటీఫుల్ కథని తెలియేస్తోంది. సుమన్, ఆమని ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీకి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు.

మోహన కృష్ణ సినిమాటోగ్రఫీ, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి, వెటరన్ తోట తరణి ఆర్ట్ డైరెక్టర్గా పని చేస్తున్నారు.

మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్. మేఘలు చెప్పిన ప్రేమ కథ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్తో చాలా క్యురియాసిటీ క్రియేట్ చేసింది.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI. Title-Code:- TELTEL12333,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**